
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శనివారం 6 సెప్టెంబరు 2025



విద్యాభివృద్ధికి బాధ్యతతో పని చేయాలి

- పిల్లలకు నాణ్యతతో కూడిన విద్యనందించండి
- సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు
- గురుపూజోత్సవంలో కలెక్టర్ ఆనంద్
- 38 మంది టీచర్లకు అవార్డులు, సత్కారం

8 లో..



తిరుమంజనం అనంతరం ఉత్సవర్లకు పూజలు చేస్తున్న అర్చకులు

కోనలో వైభవంగా పవిత్రోత్సవాలు

రాపూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన క్షేత్రంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివార్లకు ఉదయం వేద, దివ్యప్రబంధ పారాయణం అనంతరం ద్వారతోరణం, ధ్వజకుభ ఆరాదన, మహాకుభారాదన, చక్రజ్జ మండల, అగ్నిప్రతిష్ఠ, విశేష మోమాదులు, స్నపన తిరుమంజనం, ప్రాయశ్చిత్త హోమం వంటి పూజలు జరిగాయి. సాయంత్రం చతుస్థానార్చన నివేదన, దివ్య ప్రబంధ పారాయణం, విశేష హోమం, తిరుచ్చి ఉత్సవం, నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

అడుగంటుతున్న

'రాళ్లపాడు'

- 7.2 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- వర్షాలు కురవకపోతే తాగునీటికి ఇక్కట్లే

లింగసముద్రం, ,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 7.2 అడుగులకు పడిపోయింది. ప్రాజెక్టులో నీరు అడుగంటడంతో నీటి నిల్వలో ఆక్సిజన్ తగ్గి నీరు పచ్చగా వస్తోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సోమశిల జలాశయం, మన్నేరు ఎగువ భాగం నుంచి డ్యాంలోకి నీరు రావడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే డ్యాం పరిసర గ్రామాల్లో నీటిఎద్దడి తప్పేలాలేదు. దీంతో ప్రజలు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం సోమశిల ఉత్తర కాలువ పనులు జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయ్యేందుకు మరో నెల రోజులు పడుతుందని, ఆ తర్వాతనే సోమశిల నుంచి నీరు వస్తుందని అధికారులు తెలిపారు. ఈ లోపు వర్షాలు కురవకపోతే మంచినీటి ఇబ్బందులు తప్పవేమోనన్న ఆందోళన ఇటు గ్రామస్థులు.. అటు రైతుల్లోనూ నెలకొంది.

● 'సోమశిల'కు 25,288 క్యూసెక్కుల వరద

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 25,288 క్యూసెక్కుల ప్రవాశం కొనసాగింది. డ్యాంలో 66.240 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,300, డెల్టాకు 1,350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టులో 7.2 అడుగులకు పడిపోయిన నీటిమట్టం

రేపు ఏపీపీఎస్సీ పరీక్షలు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖలో బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లకు ఈ నెల 7న ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విజయ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో పరీక్షల నిర్వహణపై అధికారులతో డీఆర్వో సమీక్షించారు. నెల్లూరులో 8, కావలిలో 7 కేంద్రాలలో జరిగే పరీక్షలకు 6600 మంది అభ్యర్థులు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాటు చేయాలని, అభ్యర్థులకు అన్నీ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.



నెల్లూరు : కొళ్లపూడిలోని జగనన్న కాలనీలో పునాదుల దశలోనే ఉన్న ఇళ్లు

అవినీతికి అదే బేస్!

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద జిల్లాలో భారీగా ఇళ్లు మంజూరయ్యాయి. గత ప్రభుత్వంలో లేఅవుట్లు వేసి ఆ స్థలాల్లో ఇళ్లు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఒక్కో ఇంటి నిర్మాణానికి ఇస్తుండగా ఆ మొత్తాన్నే లబ్ధిదారుకు అందించాలని నాటి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే చాలా చోట్ల లేఅవుట్లు ఊరికి దూరంగానూ, ముంపు ప్రాంతాల్లోనూ, స్మశానాలకు సమీపాన వేయడంతో అక్కడ ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. ఈ సమయంలో నాటి ప్రభుత్వం మెహర్బానీ కోసం ఆప్షన్-3 పేరుతో కాంట్రాక్టర్ల చేత ఇళ్లు నిర్మించి ఇవ్వాలని భావించింది. లబ్ధిదారుడి అనుమతి లేకుండానే హౌసింగ్ అధికారులు ఇష్టానుసారం ఇళ్లను వందల మంది కాంట్రాక్టర్లకు అప్పగించారు. కనీసం ఒక అగ్రిమెంట్ అనేది కూడా లేకపోవడం గమనార్హం. తొలుత బీస్ లెవల్ (బీఎల్) స్థాయి నిర్మాణం జరిగితే రూ.50 వేలు ఇచ్చే విధానం ఉండగా, దానిని రూ.70 వేలకు పెంచారు. ఆ తర్వాత వేల ఇళ్లను బీఎల్ స్థాయి వరకూ నిర్మించి రూ.70 వేల లెక్కన బిల్లులు తీసేసుకొని కాంట్రాక్టర్లు మాయమయ్యారు. జిల్లాలో 82,422 ఇళ్లను మంజూరు చేయగా అందులో 36 వేలకుపైగా ఇళ్లు నాట్ స్టార్టెట్ నుంచి బేస్ లెవల్ స్థాయిలోనే ఉన్నాయి. ఇందులో 15 వేలకు పైగా ఇళ్లకు రూ.60 వేల నుంచి 70 వేల చొప్పున చెల్లించగా, మరో ఆరు వేల ఇళ్లకు రూ.30 వేల వరకూ పేమెంట్ చేసినట్లు హౌసింగ్ అధికారుల ద్వారా తెలుస్తోంది.

> గృహ నిర్మాణ శాఖలో పునాదుల మాయాజాలం
>
> బేస్‌మెంట్ కట్టడం.. రూ.70 వేలు తీసుకోవడం
>
> ఒక్కో ఇంటికి రూ.40 వేలు లాభం
>
> జిల్లాలో 15 వేల ఇళ్లు బీఎల్ స్థాయిలోనే!
>
> ఆపై నిర్మించకుండా దాగుడుమూతలు
>
> దోచుకుతిన్న కాంట్రాక్టర్లు, అధికారులు

● దోచుకున్న సొమ్ముతో వ్యాపారాలు

మొత్తంగా చూసుకుంటే బీఎల్ కన్నా తక్కువ స్థాయిలో పేమెంట్ జరిగిన సుమారు 21 వేలకు పైగా ఇళ్ల నిర్మాణం అథోగతిగా మారింది. ఒక ఇంటికి రూ.70 వేలు ఇప్పటికే చెల్లించగా, మిగిలిన రూ.1.10 లక్షలతో మిగిలిన ఇంటి నిర్మాణం పూర్తి చేయడం అసాధ్యంగా చెబుతున్నారు. అయితే బేస్‌మెంట్ స్థాయి వరకూ నిర్మించి బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్లు ఇప్పుడు మిగిలిన భాగాన్ని నిర్మించేందుకు ముందుకు రావడం లేదు. బేస్‌మెంట్ మాయాజాలంతో సంపాదించిన డబ్బులతో వేరే వ్యాపారాలు చేసుకుంటున్నారు. నాడు హౌసింగ్ అధికారులు ఒక విధానం అంటూ లేకుండా అనామక వ్యక్తులందరికీ ఇళ్లను అప్పగించడంతో ఇప్పుడు వారి చేత పనులు చేయించడం కష్టంగా మారింది. ఇప్పటికే కట్టిన బేస్‌లు కూడా చాలా నాసిరకంగా ఉండడంతో వాటి స్థానంలో మళ్లీ బేస్ నిర్మించాలంటే

- మిగతా 7లో..

నాటి వైసీపీ హయాంలో పేదల ఇళ్ల మాటున జరిగిన దోపిడీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. 'బేస్‌మెంట్' మాయాజాలాన్ని చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. వందలు.. వేలు కాదు.. కోట్ల రూపాయల పేదల సొమ్మును దిగమింగారు. ప్రభుత్వ లేఅవుట్లలో పట్టణ ప్రాంతాల్లో ఆరు అంకణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తొమ్మిది అంకణాల స్థలాన్ని పేదలకిచ్చారు. ఈ స్థలంలో నిబంధనల ప్రకారం బేస్‌మెంట్ లెవల్ కట్టేందుకు రూ.30 వేలకు మించి ఖర్చవదు. కానీ హౌసింగ్ స్కీమ్‌లో బేస్‌మెంట్ స్థాయి నిర్మాణం జరిగితే రూ.70 వేలు చెల్లించారు. అంటే ఒక్కో ఇంటికి రూ.40 వేల వరకూ మిగుల్చుకున్నారు. పోనీ ఆ బేస్‌మెంట్ అయినా నిబంధనల ప్రకారం కట్టారా.. అంటే అదీనూ లేదు. ఆరడుగులకుపైగా పిల్లర్ లోతు ఉండాల్సి ఉండగా, చాలా చోట్ల రెండు, మూడడుగులకు మించి లేదు. ఇలా కూడా ఒక్కో ఇంటిపై రూ.10 వేల వరకూ మిగిల్చుకున్నారని అంచనా. అదేవిధంగా బేస్‌మెంట్ స్థాయిలో 40 బస్తాల సిమెంటు, 340 కేజీల స్టీలు చెల్లిస్తారు. ఒక ఇంటికి వాడాల్సిన ఈ సామగ్రితో రెండు, మూడు ఇళ్ల బేస్‌లు కట్టి ఆ విధంగా కూడా దోపిడీ చేసినట్లు విచారణలో బయటపడుతోంది. మొత్తంగా ఈ బేస్‌మెంట్ మాయాజాలం ద్వారానే సుమారు రూ.100 కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టినట్లు అర్థమవుతోంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



నెల్లూరులోని దొడ్ల కౌసల్యమ్మ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డికి అవార్డు, ప్రశంసాపత్రం అందజేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

ఉత్తమ గురువులకు అవార్డుల ప్రదానం

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. జిల్లా నుంచి ఆరుగురికి ఈ అవకాశం దక్కింది.











అవార్డు అందుకున్న సీహెచ్.చెన్నయ్య, కే.డొమ్నిక్ రెడ్డి, సుజ ఎస్ నాయర్, ఎన్.భవానీ శంకర్, ఎస్.వింధ్యావళి





బూతద్దంలో ఆసర్‌ను చూస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు

ఉత్సాహంగా జులూస్ ర్యాలీ

మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను జిల్లావ్యాప్తంగా ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జిల్లాలోని అన్ని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగాయి. మహమ్మద్ ప్రవక్త సూచించిన నైతిక విలువలు, పరమత సహనం, దైవచింతన అనే అంశాలతోపాటు దివ్య ఖురాన్‌లోని దైవ సందేశాలను బోధించారు. ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో భారీ అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలు జరిగాయి. జిల్లా కేంద్రం నెల్లూరులోని మసీదులలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక నమాజులు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, దివ్య ఖురాన్ పఠనం వంటి కార్యక్రమాల్లో ముస్లింలు భారీగా పాల్గొన్నారు. సాయంత్రం చాంద్ ఆకుపచ్చని జెండాలు, ప్లకార్డులతో కోటమిట్ట యూసుఫియా మసీదు సెంటర్‌కు ర్యాలీగా చేరుకున్నారు.

● వేడుకగా జులూస్ ర్యాలీ

మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా సాయంత్రం కోటమిట్ట యూసుఫియా మసీదు సెంటర్ నుంచి ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో జులూస్ శాంతి ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, మత పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందకారంలో కూరుకుపోయిన ఆనాటి సమాజంలో దైవ ప్రవక్త మహమ్మద్ జ్ఞానజ్యోతులను వెలిగించారని తెలిపారు. విద్యా కుసుమాలు వెదజల్లారని అన్నారు. ఈ ర్యాలీలో ఇస్లామ్ సంప్రదాయ పచ్చజెండాలు, మక్కా మదీనా చిత్రాలు, చాంద్‌లు ప్లకార్డులతో యూసుఫియా మసీదు నుంచి బారకాసు పాత జడ్పీ భవనం మీదుగా చిన్నబజారు, సంతపేటల మీదుగా తిరిగి మసీదు వరకు నిర్వహించారు. పోలీసు శాఖ విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసింది.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

తరిమేసిన కొడుకు.. కన్నీళ్లు తుడవని కూతుళ్లు

ముగ్గురు పిల్లలున్నా అనాథగా రైల్వేస్టేషన్‌లో.. ● యాచిస్తూ కడుపు నింపుకుంటున్న వైనం



నెల్లూరు రైల్వేస్టేషన్‌లో కూర్చొని ఉన్న నరసమ్మ

నానాటికి పేగుబంధాలు చితికిపోతున్నాయి. నవమాసాలు మోసి, అల్లారుముద్దుగా పెంచి ప్రయోజకులను చేసిన కన్నవారిని చివరాంకంలో రోడ్డుపాలు చేస్తున్నారు. పట్టెడన్నం దొరక్క వృద్ధులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఈమె పేరు నరసమ్మ. ముగ్గురు బిడ్డలున్నా రైల్వేస్టేషనే దిక్కు అయ్యింది. ఇక్కడ యాచిస్తూ కడుపునింపుకుంటోంది. స్టేషన్‌లోని ఓ స్తంభం వద్ద దీనంగా కూర్చొని ఉన్న ఆ వృద్ధురాలిని 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. ఆమె మాటల్లోనే...

'మాది ఇందుకూరుపేట మండలం మైపాడు. ఇద్దరు కుమార్తెలు, ఓ కొడుకు ఉన్నారు. పిల్లలు చిన్నతనంలోనే భర్త చనిపోవడంతో రెక్కలు ముక్కలు చేసుకుని వారిని పెంచాను. కుమార్తెలకు వివాహం కాగా, ఒకరు భగత్‌సింగ్‌కాలనీలోను, మరికరు తిరుపతిలో ఉంటున్నారు. ఇక కుమారుడు వెంకటరమణకు వినికిడి లోపం ఉండటంతో దివ్యాంగ పించను అందుతోంది. ఈ కారణంగానే నాకు పించను రాలేదు. రెండు వారాల క్రితం ఆకలిగా ఉంది.. అన్నం పెట్టు అని కోడలిని అడిగితే లేదంది. ఇంట్లో వెళ్లి చూస్తే గిన్నె నిండా అన్నం ఉంది. ఈ విషయం కొడుక్కి చెబితే ఇంట్లోనుంచి ఇద్దరూ గెంటేశారు. ఏం చేయాలో దిక్కుతోచక ఇదిగో ఈ రైల్వేస్టేషన్‌లో తలదాచుకుంటున్నాను. ప్రయాణికులను యాచిస్తూ పొట్టనింపుకుంటున్నా.' అంటూ కన్నీటి పర్యంతమైంది. ముగ్గురు బిడ్డలున్నా అనాథలా రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారంపై తలదాచుకుంటోంది.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం)

కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం రాత్రి కామాక్షి తాయికి అర్చకులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఆలయ ప్రదక్షిణలతో పల్లకీ సేవలు నిర్వహించారు. ఉదయం గంగ, కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జునస్వామి నిత్య కళ్యాణోత్సవం భక్తులను అలరించింది. ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10114
వెండి కిలో ధర	రూ. 126900
వెండి ఒక గ్రాము	రూ. 129.90

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది గురువులే

● ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని తహసీల్దారు అంబటి వేంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారులు దిలీప్‌కుమార్, పీవీ రత్నం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న 15 మందిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ముఖ్య అతిథులు తహసీల్దారు అంబటి వేంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ గురువులను గౌరవిస్తూ, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు నారాయణ, అక్బర్, శ్రీనివాసరావు, నాగభూషణం, అరుణ కుమారి, నాగమణి, అనీలా కుమారి, సువర్ణ, సుశీల, మాధవి, వరలక్ష్మి, మస్తాన్, రాజ్యలక్ష్మి, లావణ్య, మహబూబీలను శాలువాలు, పూలమాలలతో అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు, రామ్‌గోపాల్, వెంకటేశ్వరరావు, హజరత్‌బాబు, గోపాలకృష్ణమూర్తి, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తహసీల్దారు, సీఐ

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేటి తరం అధ్యాపకులు రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, మెరైన్ బయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం హనుమారెడ్డి, డాక్టర్ వెంకట్రాయులు, డాక్టర్ వీరారెడ్డి, డాక్టర్ సుజయ్‌కుమార్ పాల్గొన్నారు.



వెంకటాచలం : రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

సర్వేపల్లి గ్రామంలో...

సర్వేపల్లి గ్రామంలో శుక్రవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు రాధాకృష్ణన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలతో నివాళులర్పించారు. రాధాకృష్ణన్ పూర్వీకులు సర్వేపల్లిలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు సందూరి శ్రీహరి, పొట్లూరు సుబ్రహ్మణ్యం, చల్లా చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.



ఈనెల 12న 16 హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

● విజయలక్ష్మి, సీడీపీవో, వెంకటాచలం

వెంకటాచలం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వెంకటాచలం, పొదలకూరు, మనుబోలు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 16 అంగన్‌వాడీ సహాయకుల (హెల్పర్) పోస్టుల భర్తీకి త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వెంకటాచలం సీడీపీఓ వి. విజయ లక్ష్మి తెలిపారు.

?. ఏఏ అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి

!. వెంకటాచలం మండలం మొలకలపూడి, పూడిపర్తి, నిడిగుంటపాళెం (ఎస్సీ), దర్బల మిట్ట, మల్లుగుంట సంఘం, కంటేపల్లి (జీసీ), ఇస్లాంపేట, కసుమూరు - 2, పొద లకూరు మండలం మరుపూరు (ఎం), ప్రభగిరి పట్నం (ఎం), మహ్మదాపురం (ఎస్టీ), కళ్యాణపురం, పొదలకూరు (ఎస్సీ కాలనీ), మనుబోలు మండలం కొమ్మలపూడి (ఎస్టీ), వీరం పల్లి - 2, బద్దెవోలు (న్యూ) అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల (హెల్పర్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

?. విద్యార్హతలు ఏమిటి

!. అంగన్‌వాడీ సహాయకుల (హెల్పర్) పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, 21 నుండి 35 సంవత్సరాలలోపు ఉన్న స్థానికంగా నివాసం ఉండే వివాహితులైన మహిళలు అర్హులు.

?. హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు ఎప్పుడు నిర్వహిస్తారు

!. నెల్లూరు నగరంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో) కార్యాలయంలో ఈనెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. విద్యార్హత, పుట్టిన తేదీ, వయసు ధృవీకరణ పత్రాలతో పాటు, తహ సీల్దారు కార్యాలయం జారీ చేసిన కుల, నివాస ధృవీకరణ పత్రాలు మొదలైన ఒరి జినల్ డాక్యుమెంట్స్, ఒక సెట్ జెరాక్స్ కాపీ, కాల్ లెటర్స్‌తో హాజరు కావాలి.

భారీ అన్న సంతర్పణ



అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

మనుబోలు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ నగర్‌లో శుక్రవారం భారీ అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. రాజావీధి యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి నాడు గణేష్ మండపాన్ని ఏర్పాటు చేశారు. అందులో భారీ వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. శనివారం గ్రామోత్సవం పురస్కరించుకుని శుక్రవారం పల్లం చిన్నమస్తానయ్య భక్తుల కోసం భారీ అన్న సంతర్పణ నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు గోగుల శ్రీనివాసులు

ముత్తుకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోగుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వమే ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఈ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధర ఏ గ్రేడ్ రకాన్ని పుట్టికి రూ. 20,306 సాధారణ రకానికి పుట్టికి రూ.20,136 రైతులకు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 9వ తేదీ ఉదయం 10 గంటలకు నెల్లూరు గాంధీ బొమ్మ వద్ద నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు జరిగే ప్రదర్శనను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఎం కార్యదర్శి గడ్డం అంకయ్య, నాయకులు పట్టపు జయరామయ్య, ఎస్‌కె మస్తాన్, కల్లూరు నాగరాజు, నక్కా శ్యాంప్రసాద్, గోడ భాస్కర్, మోహన్ రావు, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని కలిసిన కోవూరు ఏఎంసీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి

విడవలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోవూరు వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్‌గా నియమితులైన ఊటుకూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి తన అనుచరులతో కలసి నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేని గజమాలతో సత్కరించారు. కేక్ కట్ చేసి బాణ సంచా కాల్చి సంబరాలు జరిపారు. భారీగా తరలి వచ్చిన జన సందోహంతో వీపీఆర్ నివాసం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోవూరు మాజీ ఏఎంసీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి, టీడీపీ మండల ఇన్‌చార్జ్ అడపాల శ్రీధర్ రెడ్డి, ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, నాయకులు ఏటూరు హరిరెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, వెల్లంపల్లి దిలీప్, వేగూరు చంద్రారెడ్డి, ఉచ్చూరు సుదీప్ రెడ్డి, ఆవుల రవిచంద్ర, చెముకుల శ్రీనివాసులు, సురేంద్రరెడ్డి, ఆవుల వాసు, కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, సమాది శ్రీనివాసులు, తాతా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేని గజమాలతో సత్కరిస్తున్న వంశీకృష్ణారెడ్డి

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

● బీజేపీ నేత మిడతల రమేష్

పొదలకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ధాన్యానికి మద్దతు ధర లేదని, రైతులను ఆదుకోవాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. శుక్రవారం పొదలకూరు బీజే పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతులు.. కౌలు రైతులు.. మధ్య తరగతి ప్రజల కష్టాలపై బీజేపీ కార్యకర్తలు నిరంతరం స్పందిస్తూ ఉండాలని కార్యకర్తలకు సూచించారు. జిల్లా రైతులకు పౌర సరఫరాల శాఖ సహకారం లేదన్నారు. రైతుల కేఎన్ఎం ధాన్యాన్ని పుట్టి రూ.16 వేలకు, పది పది రకం ధాన్యాన్ని పుట్టి రూ.15 వేలకు తెగనమ్ము తున్నారన్నారు. జిల్లాలో రూ.30 వేల మంది కౌలు రైతులు ఎకరాకు రూ.7వేల నుంచి రూ.10 వేల వరకు నష్టపోయారన్నారు. సమస్య పరిష్కారంపై అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పూల ప్రశాంత్, రాచపూటి ధనుంజయ, చొప్పా వెంకటేశ్వర్లు, చింతగింజల సుబ్రహ్మణ్యం, రవీంద్ర, రంగారావు, రమణమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిడతల రమేష్

నేడు విభిన్న ప్రతిభావంతులకు వైద్య శిబిరం

వెంకటాచలం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం విభిన్న ప్రతిభావంతులకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు సుధీర్ ప్రేమ్‌కుమార్, శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకరణాలు కూడా అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అర్హులు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యుడీఐడీ, రేషన్ కార్డుతోపాటు మూడు ఫోటోలతో హాజరు కావాలన్నారు. వైద్య శిబిరంలో గుర్తించిన విద్యార్థులకు వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు, సీపీ చైర్లు, రోలేటర్, ఎంఆర్ కిట్, బ్రెయిలీ కిట్ మొదలైన ఉపకరణాలు అందచేస్తారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అశాస్త్రీయ ధోరణులను విడనాడాలి

కోవూరు, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అశాస్త్రీయ ధోరణులను విడనాడాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఉదయభాస్కర్ సూచించారు. స్థానిక సీతాపోలయ్య భవనంలో శుక్రవారం జరిగిన జనవిజ్ఞాన వేదిక మండల మహా సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతుంటే ప్రభుత్వాలు మతవాదాన్ని, మనువాదాన్ని అనుసరిస్తున్నాయని విమర్శించారు. మహాసభ గౌరవాధ్యక్షుడిగా ముక్కు చంద్రమౌళి, అధ్యక్షుడిగా గౌస్‌లాజం, ప్రధాన కార్యదర్శిగా టీ పుల్లయ్య, కోశాధికారిగా రహంతుల్లా, ఉపాధ్యక్షులుగా సురేంద్ర, శ్రీశైల, కార్యదర్శులుగా డాక్టర్ ఇర్ఫాన్, ఖాజావలి, బీ వెంకయ్య, భాస్కరరావు, టీ శేషయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, బీ మనోహర్, భారతి, వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న ఉదయభాస్కర్

మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌కు చైర్‌పర్సన్ దంపతుల శుభాకాంక్షలు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత బెజవాడ వంశీ కృష్ణారెడ్డి కోవూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ)చైర్మన్‌గా నియమితులు కావడం ఆనందదాయకమని బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళి దంపతులు హర్షం వ్యక్తం చేశారు. పదవి ఇప్పించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నివాసంలో బెజవాడ వంశీ కృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.



వంశీకృష్ణారెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న సుప్రజ, మురళి దంపతులు

బుచ్చిలో ముస్లింల ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం కాశీపాళెంలో మసీదు వద్ద శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు జరిగాయి. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో ముస్లింలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి రాత్రి కాశీపాళెం, ఖాజానగర్‌లో అన్నదానం నిర్వహించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

సంగం, సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు శుక్ర వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అగ్రికల్చర్ విజి లెన్స్ అధికారి టి వే ణుగోపాల్‌రావు, డిప్యూటీ కమర్షియ ల్ ట్యాక్స్ ఆఫీసర్ విష్ణురావు దుకా ణాల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎరువుల ని ల్వలు, పురుగు మందులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా తదితర ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, ఎంఆర్పీ ధర కంటే అధికంగా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఏవో శశిధర్ ఉన్నారు.

లంబోదరుడి లడ్డు రూ. 55 వేలు

మనుబోలు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక తూర్పువీధిలో ఆర్‌ఆర్‌ఆర్ టీమ్ ఆధ్వర్యంలో గణేష్ మండపంలో చవితి వేడుకలు నిర్వహించారు. 9రోజుల తరువాత గురువారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. అంతకు ముందు లంబోదరుడి లడ్డును వేలంపాట నిర్వహించారు. మనుబోలుకు చెందిన మద్దూరు మహేష్ రూ. 55వేలకు దక్కించుకున్నారు. అనంతరం గ్రామోత్సవం చేసి గణనాధుని స్థానిక కండలేరు వాగులో నిమజ్జనం చేశారు.

మనుబోలు పీహెచ్‌సీ ప్రారంభానికి మోక్షమెప్పుడో..?

మనుబోలు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సర్వ హంగులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది. గత ప్రభుత్వంలో ఏళ్ల తరబడి సాగుతూ వచ్చిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవతో 8 నెలల్లోనే పూర్తిచేశారు. దీంతో రంగులు అద్దుకున్న కొత్త భవనంలోకి ఎప్పుడు వెళతామోనని ఇటు వైద్య సిబ్బంది, అటు రోగులు ఎదురు చూస్తున్నారు.

● కేవలం ఎనిమిది నెలల్లోనే పూర్తి

1997 వరకు మనుబోలులో పీహెచ్‌సీకి భవనం అంటూ లేనే లేదు. అద్దె గదుల్లో నిర్వహిస్తుండేవాళ్ళు. ఆనాటి టీడీపీ ప్రభుత్వం జన్మభూమి పథకం కింద పీహెచ్‌సీ అభివృద్ధికి సహకరిస్తామని చెప్పడంతో మాజీ సర్పంచు చిట్టమూరు పద్మనాభరెడ్డి తాను పీహెచ్‌సీకి విరాళాలు ఇస్తానని ముందుకు వచ్చారు. రూ. 7.60 లక్షలతో పీహెచ్‌సీ, రూ.3.60 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టి నాలుగు నెలల్లోనే పూర్తి చేశారు. దీంతో చిట్టమూరు వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా నామకరణం చేసి అప్పటి వైద్య ఆరోగ్య శాఖా మంత్రి ఎన్ జనార్దన్ రెడ్డి ప్రారంభించారు.

● గత ప్రభుత్వంలో నాలుగేళ్ళలో నాలుగుగోడలు..

అప్పటినుంచి అందులోనే వైద్యసేవలు అందిస్తున్నారు. అయితే గత కొద్ది సంవత్సరాలుగా భవనం దెబ్బతిని శిథిలావస్థకు చేరడంతో 2020 నవంబర్‌లో అప్పటి ఎమ్మెల్యే కాకాణి గోవర్దన్ రెడ్డి రూ. 1.68 కోట్లతో నాడు-నేడు పథకం కింద నూతన పీహెచ్‌సీ భవన నిర్మాణం చేపట్టేందుకు శంఖుస్థాపన చేశారు. అయితే 2024 ఎన్నికల వరకు పీహెచ్‌సీ నిర్మాణం సాగుతూ వచ్చింది. తరువాత నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అంటే గత ప్రభుత్వంలో నాలుగేళ్ళలో కేవలం నాలుగు గోడలు నిర్మించి వదిలేశారు. మిగతా పనుల నిర్మాణం జరగలేదు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

● ఎమ్మెల్యే సోమిరెడ్డి కృషితో...

పీహెచ్‌సీ నిర్మాణం ఆగిపోయిందని తెలుసుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గతేడాది డిసెంబర్‌లో పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఎందుకింత నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌లతో సమీక్ష చేశారు. త్వరగా నిర్మాణం పూర్తిచేయాలని ఆయన అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జనవరిలో పనులు ప్రారంభించి ఆగస్టు చివరి నాటికి ఆగిపోయిన పనులన్నింటినీ పూర్తిచేశారు.

● రిబ్బన్ కట్ చేయడమే తరువాయి...

గదుల నిర్మాణం, ఫ్లోరింగ్, సీలింగ్, రంగులు, కరెంటు, ఫర్నిచర్, భవనం ముందు సిమెంట్ రోడ్డు, ప్రహరీ, గేట్లు ఇలా ఒక్కొక్క పని చకాచకా చేసేశారు. దాదాపు 8నెలల్లోనే రూ.70నుంచి 80 లక్షల పనులు పూర్తిచేశారు. ఇక ఎమ్మెల్యే వచ్చి రిబ్బన్ కట్ చేయడమే తరువాయి.

C.R.I.M.E N.E.W.S

బహిర్భూమికి వెళ్లి మత్స్యకారుడి మృతి

బిట్రగుంట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ తూర్పు తీరప్రాంతం పాత కడపాలెంకు చెందిన చిన్నంగారి అంజయ్య (51)బహిర్భూమికి వెళ్లి మృతి చెందినట్లు పోలీ సులు శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంజయ్య ఇతర రాష్ట్రాల్లో చేపల వేటతో కుటుంబాన్ని పోషించుకునేవాడన్నారు. ఇటీవల అనారోగ్యం కారణంగా ఇంటి వద్దే ఉంటున్న అంజయ్య బహిర్భూమికి వెళ్లి చిల్లచెట్ల వద్ద మృతి చెందినట్లు భార్య పోలమ్మ తెలిపిందన్నారు. కావలి రూరల్ సీఐ పాపారావు, ఎస్ఐ ప్రభాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



అంజయ్య మృతదేహం

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి ..

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వేదాయపాలెం -వెంకటాచలం రైల్వే స్టేషన్‌ల మధ్య పడారుపల్లి ప్రాంతంలో గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. మృతుడు 35-40 ఏళ్ల మధ్య వయస్సు కలిగి నలుపురంగు కట్ బన్నియన్, గోధుమ రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ సీఆర్పీఎఫ్ జవానుపై దాడి

వెంకటాచలం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లి పంచాయతీ ముత్యాల గుంటలో గురువారం రాత్రి వాలంటరీ రిటైర్డ్ సీఆర్పీఎఫ్ జవాన్‌పై ఐదుగురు వ్యక్తులు దాడిచేశారు. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొచ్చు రామయ్య సీఆర్పీఎఫ్ జవాన్‌గా వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ప్రస్తుతం స్థానికంగా సెక్యూరిటీ విభాగంలో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం రాత్రి గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా కొందరు యువకులు బాధితుడి కుమారుడు సాయితేజతో గొడవకు దిగారు. అప్పుడే విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన రామయ్య గొడవ జరుగుతున్న విషయాన్ని గుర్తించి తన కుమారుడిని ఇంట్లోకి పంపించి వేశాడు. అయితే కొద్దిసేపటి తర్వాత రామయ్యపై కర్రలు, రాళ్లతో ఐదుగురు వ్యక్తులు దాడి చేయడంతో రామయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ఆయనను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడ్డ బొచ్చు రామయ్య

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు రౌడీషీటర్ల అరెస్ట్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు రౌడీషీటర్లను దర్గామిట్ట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని పోస్టల్‌కాలనీ 6వ వీధిలో నివాసం ఉంటూ ప్రస్తుతం టెక్కేమిట్టలో ఉంటున్న మేరిగ ప్రవణ్ అలియాస్ చింటు, కనుపర్తిపాడుకు చెందిన చెముడుగుంట రవికిరణ్‌లు రౌడీషీటర్లు. వీరిద్దరు శుక్రవారం ఉదయం పొదలకూరు రోడ్డులోని క్యాన్సర్ వైద్యశాల సమీపంలో ప్రభుత్వ వైద్యశాల ప్రహరీగోడ రోడ్డు మార్జిన్‌లో చెట్టుకింద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యకు అందింది. ఆయన దాడులు చేసి ఇద్దరు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైకిళ్లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కలిగిరి, సెప్టెం బరు 5 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కావలి- వింజమూరు జాతీయ రహదారిపై వీరన కొల్లు సమీపాన రెండు మోటారు సైకిళ్ల ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యారు. కొండాపురం మండలం బసినేనిపల్లికి చెందిన గురుప్రసాద్ మోటారు సైకిల్‌పై వెళుతుండగా, కలిగిరి మండ లానికి చెందిన డేగా దొరబాబు మోటారు సైకిల్‌లో వెనుకనుండి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ 108 వాహనంలో వింజమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై వివరాలు సేకరించి, విచారణ చేపట్టినట్టు ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన దొరబాబు

సముద్రంలో ఇద్దరు యువకుల గల్లంతు

● సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన మెరైన్ పోలీసులు

కావలి రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం తుమ్మలపెంట సముద్రతీరంలో శుక్రవారం సాయంత్రం సముద్రస్నానం చేస్తూ ముసునూరుకు చెందిన పెద్దిపోగు దివాకర్, కిశోర్ అలల తాకిడికి కొట్టుకుపోయారు. వారిని గుర్తించిన మెరైన్ ఎస్ఐ జానకిరామయ్య కానిస్టేబుల్ బాలసుబ్రహ్మణ్యం, స్థానిక వ్యక్తి సముద్రంలో కొట్టుకుపోతున్న వారిద్దరినీ రక్షించారు. ఎస్ఐ బోటు పంపించడంతో యువకులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.



యువకులను కాపాడిన మెరైన్ పోలీసులు

రేషన్ అక్రమ రవాణాలో సూత్రధారులు ఎవరు?

అనంతసాగరం సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాగరం కేంద్రంగా రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. రెండు రోజుల క్రితం అక్రమ తరలింపునకు భారీగా సేకరించిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీసు, పౌర సరఫరాల శాఖ అధికా రులు ఇనగలూరు వద్ద పట్టుకొన్న విషయం తెలిసిందే. కాగా ఇందులో సూత్ర, పాత్రదారులు ఎవరు? వారిని గుర్తించారా? వారిపై చర్యలు ఉంటాయా? అనే ప్రశ్నలు చర్చకు తెరలేపాయి. గత వైసీపీ హయాం నుంచి వెంగం పల్లికి చెందిన కొందరు నాయకులు, మూఠా సభ్యులు రేషన్ రవాణాలో చక్రం తిప్పుతున్నారు. ఇదే వ్యాపారంగా మలుచుకొని రూ.లక్షలు గడిస్తున్నారు. ఇందులో కొందరు రేషన్ డీలర్ల హస్తం కూడా ఉంది. పేదలకు ఇచ్చే సరుకులు లబ్ధిదారులకు ఇవ్వకుండా నామమాత్రంగా నగదు ఇచ్చి సీలు బస్తాలు బయటకు తరలించేస్తున్న వైనం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సుమారు 200 నుంచి 300 బస్తాల బియ్యం రహస్యంగా దాచి అక్రమ తరలింపునకు పూనుకోవడం అధికారుల నిఘా వైఫల్యానికి ఈ సంఘటన అద్దం పడుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 545

రేపు పౌర్ణమి ధుని పూజ

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట గురు నిలయం వెంకయ్యస్వామి ఆలయంలో ఈనెల 7న చంద్రగ్రహణం, పౌర్ణమిల సందర్భంగా ఉదయం 9గంటలకు ధుని పూజ జరుగుతుందని మాకాని కుటుంబ సభ్యులు, భక్తబృందం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పూజ స్వామివారి అష్టోత్తర సహస్ర నామార్చనతో గురు భగవానులకు జరుగుతుందని, భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

నేత్రదానం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన యెల్లంపల్లి పెంచలయ్య(69) శుక్రవారం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు రాజా, సుజాతల అంగీకారంతో మృతుడి నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. నేత్రదానం చేయాల్సిన వారు 9959589321కు ఫోన్ చేయాలని కోరారు.



పెంచలయ్య(ఫైల్)



వెంకటేశ్వరపురం నుంచి జనార్దనరెడ్డి కాలనీకి వెళ్లే దారిలో వీధి కుళాయికి ఏర్పాటు చేసిన పైపు

అంతా అనధికారమే..!

● వీధి కుళాయిలకు వ్యక్తిగత పైపులైను ● అవస్థలు పడుతున్న ప్రజలు ● పట్టించుకునే వారు కరువు

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కుళాయిల్లో తాగునీరు వస్తోంది త్వరగా పట్టుకోండి అనేది గతం.. అయితే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా దాదాపుగా కార్పొరేషన్ పరిధిలో ప్రతి ఇంటికి ప్రత్యేకంగా కుళాయి ఏర్పాటు చేసుకున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం వీధి కుళాయిలను ప్రత్యేకంగా తమ సొంత కుళాయిల మాదిరిగా ఏర్పాటు చేసుకుని నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. సొంతింటి కుళాయి ఉంటే నీటి పన్ను కట్టాలి.. కాబట్టి వీధి కుళాయికి పైపులు ఏర్పాటు చేసుకుని పకడ్బందీగా నీటిని వాడేసుకుంటున్నారు. అదేమిటని ప్రశ్నిస్తే వారిపై గొడవలకు దిగుతున్నారు. ఓవైపు నగరపాలక సంస్థలో నీటి కుళాయిల పన్నులు భారీగా పెరిగిపోతున్నాయి. మరోవైపు అధికారులు పన్నుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. అయితే పది మంది కోసం ఏర్పాటు చేసిన వీధి కుళాయిలు కేవలం మాకోసమే అన్నట్లుగా కొందరు ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లోని అన్ని ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. వీధి కుళాయి అంటే సమీపంలోని దాదాపుగా 10 నుంచి 20 ఇళ్లకు అవసరమైన తాగునీరు అందించేది. తాగునీరు వచ్చే సమయాలు తెలుసుకుని బయటి పనులు మానుకుని ఇంటి వద్దకు చేరుకుని తాగునీరు పట్టుకునే పరిస్థితి. అయితే ఇటీవల కాలంలో దాదాపుగా ప్రతీ ఇంటికి ప్రత్యేకంగా కుళాయి పైపులైను లాగించుకని పన్నులు చెల్లిస్తున్నారు. అయితే కొందరు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వారికి ఉన్న రాజకీయ పలుకుబడి లేదంటే రౌడీయిజం లేదంటే నోటి దురుసుదనంతో వీధి కుళాయిని కాస్తా ప్రత్యేకంగా మా కోసమే ఉందని అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వీధి కుళాయికి మరొకరికి అవకాశం ఇవ్వకుండా పైపులు ఏర్పాటు చేసుకుని మున్సిపల్ తాగునీటిని సొంతానికి వాడేసుకుంటున్నారు. అదేంటని ప్రశ్నిస్తే వారిపై నోరుపారేసుకుంటున్నారు.

● కాలువల్లోకి వృథాగా..

సాధారణంగా కార్పొరేషన్ అధికారులు అందించే తాగునీరు అవసరమైన మేర వాడుకుని కుళాయిలను కట్టేస్తారు. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఎంతో విలువైన తాగునీటిని కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఎందుకిలా అని పరిశీలిస్తే కాలువల్లోని చెత్తని సెప్టిక్ ట్యాంకుల్లోని వ్యర్థాలను దూరంగా పోగొట్టేందుకు సురక్షితమైన తాగునీటి వినియోగిస్తున్నారు. దీన్ని బట్టి కొన్ని ప్రాంతాల్లో సెప్టిక్ ట్యాంకులు లేవనేది అర్థమవుతోంది. అసలు ఇళ్ల నిర్మించుకుంటున్న యజమానులు సెప్టిక్ ట్యాంకులు ఏర్పాటు చేసుకుంటున్నారా అనే ప్రశ్న అందరిలో నెలకొంటోంది. కానీ కార్పొరేషన్ అధికారుల్లో మాత్రం ఈప్రశ్న రావడం లేదంటే వారి విజ్ఞతకే వదిలేయాల్సిన పరిస్థితి. నగరంలో ఎంతో మంది సొంతానికి ఇళ్లు కట్టుకుని జీవనం సాగిస్తున్నా చాలా మంది తాగునీటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసుకోలేదు. వీధి కుళాయిలను సొంతకుళాయిలుగా వాడుకోవడమే ఇందుకు ప్రధాన కారణం. కొన్ని ప్రాంతాల్లో ఒక కుళాయికి రెండు ఏర్పాటు చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. అయితే అధికారులకు అవన్నీ కనిపించవు. కేవలం సొంతింటి కుళాయి కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి... వాటికి పన్నులు చెల్లిస్తున్నారా లేదా.. వారికి నోటీసులు ఇవ్వండి అనే స్థాయిలోనే ఉన్నారే తప్ప నీటి చౌర్యానికి పాల్పడుతున్న వీటిని మాత్రం పట్టించుకోవడం లేదు. పైగా నీరు రాకపోతే ఎంటనే వారివద్ద నుంచే కార్పొరేషన్ సిబ్బందికి ఎక్కువ ఫోన్లు వస్తుంటాయి. అయితే సచివాలయం సిబ్బంది మాత్రం ఇలాంటి వారికి ప్రత్యేకంగా వెసులుబాటు కల్పిస్తూ సొంతింటి కుళాయి పన్నులు చెల్లించాలంటూ మిగిలినవారికి ఫోన్లు చేయడం పరిహాసంగా మారుతోంది. ఉన్నతాధికారులు తాగునీటి చౌర్యాన్ని నివారించాల్సిన అవసరం ఉందని పన్నులు చెల్లించే కుళాయిల యాజమాన్యం కోరుతోంది.



మూలాపేట రావిచెట్టు సెంటర్‌లో వీధి కుళాయికి వేసిన పైపు



జనార్దనరెడ్డి కాలనీలోనూ ఇలా పైపు వేసి..

ఒకరి నేత్రదానంతో ఇద్దరికి కంటి చూపు

● జిల్లా అంధత్వ నివారణ సంస్థ మేనేజర్ డాక్టర్ శార్వాణి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ఒకరు నేత్రాదానం చేస్తే ఇద్దరికి కంటి చూపు ప్రసాదించవచ్చని జిల్లా అంధత్వ నివారణ సంస్థ మేనేజర్ డాక్టర్ శార్వాణి తెలిపారు. శుక్రవారం నగరంలోని నెల్లూరు స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో 40వ జాతీయ నేత్రదానం పక్షోత్సవాల అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శార్వాణి మాట్లాడారు. మరణానంతరం 6 గంటలలోగా నేత్రదానం చేస్తే మరొకరికి ఉపయోగపడతాయన్నారు. కుటుంబ సభ్యులు సహృదయంతో ముందుకు వచ్చి మరణించిన వారి నేత్రాలను దానం చేయాలన్నారు. నేత్రదానం కుటుంబ సంప్రదాయంగా మార్పు రావాలన్నారు. విద్యార్థి దశ నుంచే నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, పీహెచ్‌పీ నేతలు రామ రాఘవయ్య, శంకరరావు, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ పామూరు మల్లికార్జున, శిల్ప, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



నేత్రదానంపై అవగాహన కల్పించే కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ శార్వాణి, తదితరులు

వెన్నెముక వ్యాధిగ్రస్తురాలిని

పీ4 పథకం కింద ప్రభుత్వం ఆదుకోవాలి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : నగరంలోని 47వ డివిజన్‌లో వెన్నెముక వ్యాధితో బాధపడుతున్న మల్లెంబాక ఉమాను పీ-4 పథకం కింద ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు కోరారు. శుక్రవారం బాధితురాలి నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా ధర్మవరంతో పాటు ఆ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేస్‌కుమార్ మాట్లాడారు. 2013 నుంచి దాదాపు 12 ఏళ్లుగా ఆమె వెన్నెముక వ్యాధితో బాధపడుతూ ఇంటికే పరిమితమైందన్నారు. ప్రస్తుతం సాయం కోసం ఎదురు చూస్తుందన్నారు. ఈమె పరిస్థితిని మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ దృష్టికి కూడా తీసుకు వెళుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కలవకుంట భాస్కర్, కంచి కృష్ణ, భవాని, అశోక్, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లను తలపిస్తున్న వైసీపీ నేతల భాష

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న వాకాటి నారాయణరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు వాడుతున్న భాష రౌడీషీటర్ల కన్నా ఘోరంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణ రెడ్డి ధ్వజమెత్తారు. ఇలా దిగజారి మాట్లాడేవారిని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అదుపు చేయకపోవడం రాష్ట్ర ప్రజలకు ఏ సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మా పార్టీ అధికరంలోకి వస్తే మా నాయకులు, కార్యకర్తలు గొడ్డలతో వస్తామంటూ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు జుగుప్సాకరంగా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి చర్యలకు పాల్పడే 151 సీట్లు నుంచి 11 సీట్లుకు వచ్చినా వారికి బుద్ధి రాలేదని విమర్శించారు. రౌడీ రాజకీయాలను కూటమి ప్రభుత్వంలో ప్రోత్సహించమని చెప్పడానికైనా ఇష్టానుసారంగా మాట్లాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, డీజీపీని కోరుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు జీఎస్టీ తగ్గింపు ద్వారా వరాలజుల్లు కరిపించిందన్నారు. గతంలో నాలుగు శ్లాబుల్లో ఉన్న జీఎస్టీ సిస్టంను రెండు శ్లాబ్‌లకు కుదించారన్నారు. ప్రధానంగా జీవిత, వ్యక్తిగత, ఆరోగ్య బీమా రంగానికి 18శాతం నుంచి జీరో శాతంకు జీఎస్టీను తీసుకురావడం అభినందనీయమ న్నారు. వైద్యరంగం, విద్యారంగంలో 18 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతంకు, మోటారు వెహికల్స్ విభాగంలో రూ.20 లక్షల లోపు ఉన్న వాహనాలకు జీఎస్టీ తగ్గించడం, వ్యవసాయ రంగానికి చెందిన ట్రాక్టర్లు, ఇతర వస్తువులకు భారీగా జీఎస్టీలు తగ్గించడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షు డు ఎర్రబోలు రాజేష్, నాయకులు మండ్ల ఈశ్వరయ్య, గడ్డం విజయ కుమార్‌యాదవ్, యాకశిరి ఫణిరాజు, మెగరాల సురేష్, రాధాకృష్ణగౌడ్, మీడియా ఇన్‌చార్జ్ చిన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

మహిళలను ఆకట్టుకుంటున్న ఎక్స్‌పో

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మినీబైపాస్ రోడ్డు జీపీఆర్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో మహిళలను ఆకట్టుకుంటోంది. శుక్రవారం ఆ ఎక్స్‌పో సందర్శనకు మహిళలు బారులు తీరారు. దేశం నలుమూలల నుంచి చేనేత తయారుదారులుతో 36 స్టాల్స్ కళకళలాడుతున్నాయి. ఈ చేనేత వస్త్ర ప్రదర్శన అమ్మకాలను ఉత్పత్తి ధరలకే విక్రయిస్తున్నారు. ఈ ప్రదర్శనలో పశ్చిమ బెంగాల్ కాటన్ చీరలు, బనారస్ చీరలు, టిస్సార్‌ల కొత్త ప్రింటెడ్ శారీస్, చెందేరి, మహేశ్వరి, కోటా, రాజ్‌కోటి, పటోలా, కచ్‌బందిను, బెంగళూరు ప్యూర్ క్రేప్ సిల్క్స్, బీహార్, జార్ఖండ్, టిస్సార్, వస్త్రాల మెటీరియల్స్, గద్వాల్, కలంకారీ, కాంచీపురం, పైదానీ చీరలు, వెంకటగిరి, ఉప్పాడ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ బెడ్‌షీట్స్, ఆభరణాల స్టాల్స్ ఉన్నాయి. ఎగ్జిబిషన్ నిర్వాహకులు యర్రా శ్రీనివాసరావు మహిళల ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 8వతేదీ వరకు ఈ ఎక్స్‌పో ఉంటుందని, ప్రజలు అందరూ సందర్శించి చేనేత కళాకారులను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.



ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పోలో చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

99 సార్లు రక్తదానం చేసిన దాతకు సన్మానం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడుగా, 99 సార్లు రక్తదానం చేసిన రక్తదాతగా, ప్రజాసైన్స్ వేదిక పట్టణ అధ్యక్షుడుగా విద్యార్థులకు ఎన్నో సేవలు అందిస్తున్న మురిగిపూడి సతీష్‌కుమార్‌కి శుక్రవారం ఘన సన్మానం జరిగింది. నగరంలోని భవానీ గెస్ట్ ఇన్‌లో రెడ్‌క్రాస్ సంస్థ ఈ కార్యక్రమం నిర్వహించింది. అలాగే మురిగిపూడి ట్రస్ట్ అధ్యక్షుడుగా సతీష్‌కుమార్ విద్యార్థులకు అందిస్తున్న సేవా కార్యక్రమాలకు రోటరీ లయన్స్ క్లబ్‌ల ద్వారా సమాజానికి అందించిన సేవలకు గుర్తుగా భూమి ఇన్‌ఫ్రా రియాలిటీ వారు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రక్తదానం మోటివేటర్ సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.



సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న సాయిరాం

అవినీతికి అదే 'బేస్'!

(5వ పేజీ తరువాయి)

డబ్బులు సరిపోవు. పోనీ కొత్తవారితో మిగిలిన పనులు చేయిద్దామా.. అంటే గిట్టుబాటు కాదని వారు వెనకడుగు వేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాటి హౌసింగ్ అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. కాగా కొన్నిచోట్ల బేస్‌మెంట్‌లు కూడా నిర్మించకుండానే అధికారులు బిల్లులు చెల్లించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఇలా కట్టిన నిర్మాణాలకు, చెల్లించిన మొత్తాలకే భారీ తేడా ఉందని గుర్తించి విజిలెన్స్ విభాగం సుమారు రూ.110 కోట్లు జిల్లాలో దుర్వినియోగమైనట్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.

రాధాకృష్ణన్ సేవలు చిరస్మరణీయం

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం): సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు చిరస్మరణీయమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె నివాసంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయన జీవితం యువతకు ఆదర్శప్రాయమన్నారు.

● ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆ అసోసియేషన్ కార్యాలయంలో 10 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన 4 డీఏలను వెంటనే ఇవ్వాలని కోరారు.

● స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కలెక్టరేట్ శాఖ ఆధ్వర్యంలో రామయ్యబడి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ శాఖాధికారి పీసీహెచ్ హరికృష్ణ, ఎం.శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● విశ్వసాయి కళాశాలలో గురుపూజోత్సవం

నెల్లూరు(విద్య) : మాగుంటలేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించి మాట్లాడారు. అనంతరం డైరెక్టర్‌ను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● 'వివేకానంద' ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్నం రవిచంద్ర, తదితరులు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్‌లో సభ్యులైన ఉపాధ్యాయులు యు.కొండారెడ్డి, డీవీ.సుబ్బరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు స్వర్ణ రమేష్‌బాబు, తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, అసోసియేషన్ సభ్యులు కేఎంకే.రెడ్డి, సుబ్బరామిరెడ్డి, విజయమోహన్‌నాయుడు, ఆరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● సైన్స్ కార్నర్‌లో...



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

నగరంలోని కొండాయపాళెంలో ఉన్న ఏవీఎం కిడ్స్ సైన్స్ కార్నర్‌లో రిటైర్డ్ ప్రిన్సిపాల్ చంద్రశేఖరశర్మ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గంగిశెట్టి శివకుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఫణిరాజ్‌కుమార్, జయరామ్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్వైజర్ ఏవీ.సుధాకర్, వీఎస్‌యూ రసాయనశాస్త్ర ప్రొఫెసర్ వీరారెడ్డి, ఎస్ఎస్ఏ ఏఎంవో జీ.సుధీర్‌బాబు, నెల్లూరు రూరల్ ఎంఈవో-2 హమీద్, బాలభవన్ డైరెక్టర్ జీ.సుభద్రాదేవి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఏసీ స్టేడియం వాకర్స్ ఆధ్వర్యంలో...

ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు గోవిందయ్య, మాలకొండయ్యలను, లెమన్ ట్రీస్కూల్ కరస్పాండెంట్ హరిప్రసాద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు వేలూరు రంగారావు, కిలారి తిరుపతినాయుడు, శేషగిరిరావు, రామానాయుడు, సురేష్, రఘురామనాయుడు, రిటైర్డ్ ఇంజనీర్ మాలేపాటి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

● ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో...

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్‌వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్‌లోని 36 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులనాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

● 38 మంది విశ్రాంత గురువులకు సన్మానం

నెల్లూరు(సాంస్కృతికం) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని భక్తవత్సలనగర్‌లోని పెన్షన్ భవన్‌లో 38 మంది విశ్రాంత టీచర్లకు ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, సంఘ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కోశాధికారి ఎస్‌వీ.సుబ్బరాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వీ.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం.గౌస్, కార్యదర్శి ఎస్‌పీవీఎస్.మూర్తిలు పాల్గొన్నారు.



పెన్షనర్స్ అసోసియేషన్ భవన్‌లో సన్మానం అందుకున్న విశ్రాంత ఉపాధ్యాయులు

మెడికవర్‌లో రక్తప్రసరణ మెరుగుపరిచే చికిత్స

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మధుమేహ రోగులు వ్యాధి తీవ్రత వల్ల కాళ్లు, చేతులు కోల్పోకుండా రక్తప్రసరణ మెరుగుపరిచే చికిత్స మెడికవర్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నట్లు ఎండో వాస్కులర్ సర్జన్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మెడికవర్ ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీ డయాలసిస్ రోగులకే కాకుండా వెరికోస్ వెయిన్స్‌కు ఆధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇప్పటి వరకు చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాలలోనే ఇలాంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రక్తనాళాలు, రక్తప్రసరణకు సంబంధించి ఆధునిక చికిత్సలు ఇక మెడికవర్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రక్తనాళాలు మూసుకు పోవడం వల్ల కలిగే నయం కాని గాయాల వంటి సమస్యలకు ప్రత్యేక చికిత్సను అందిస్తామన్నారు. ఇలాంటి నరాలకు అంజియో ప్లాస్టీ స్టెంటింగ్, బైపాస్ చికిత్సల ద్వారా శస్త్రచికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ సెంటర్ హెడ్ రంజిత్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ అభిజిత్, మార్కెటింగ్ హెడ్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుదర్శన్‌రెడ్డి

వడ్డీ వ్యాపారంలో వివాదం

● ఇద్దరు మహిళలపై కేసు నమోదు

ఉలవపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారంలో ఇద్దరు మహిళల మధ్య తలెత్తిన వివాదంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో కేసులు నమోదైనట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నేటికోటకు చెందిన నంబూరి అనురాధ అదే గ్రామానికి చెందిన గొత్తుల నాగమణి వద్ద నుంచి మూడేళ్ల క్రితం రూ. 2 లక్షలు అప్పుగా తీసుకుంది. ఇటీవల కాలంలో అనురాధ కొంత సొమ్ము చెల్లించగా, మిగిలిన డబ్బు ఈనెల 3వ తేదీన వడ్డీ తగ్గించి చెల్లించబోయింది. దీంతో వడ్డీ తగ్గించేది లేదని, చెల్లించాలని నాగమణి పట్టుపట్టడంతో ఇద్దరి మధ్య వాదనలు జరిగాయి. ఈక్రమంలో తనను కొట్టి మెడలోని 6 సవర్ల బంగారు గొలుసు నాగమణి లాక్కొందని, గాయపడిన అనురాధ ఉలవపాడు సీహెచ్‌సీలో చేరగా వైద్యుల రిపోర్టు మేరకు నాగమణిపై కేసు నమోదు చేశారు. కాగా, తనకు చెల్లించాల్సిన డబ్బులు అడగానికి వెళ్లిన తనను అనురాధ, ఆమె కొడుకు ఇద్దరూ కలిసి కొట్టగా నాగమణి కూడా ఉలవపాడు ఆసుపత్రిలో చేరింది. దీంతో వైద్యులు ఇచ్చిన సమాచారం ఆధారంగా అనురాధ, ఆమె కొడుకుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనంతపురంలో టీడీపీ నేత గిరిధర్

నెల్లూరురూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ కావడంతో ఈనెల 10వ తేదీన అనంతపురం జిల్లాలో విజయోత్సవ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబనాయుడు పాల్గొననున్నారు. దీంతో అక్కడి ఏర్పాట్లలో కొన్ని బాధ్యతలను నెల్లూరురూరల్ టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి అప్పగించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం అనంతపురం వెళ్లారు. అక్కడ స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు, డీఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి సభ ప్రాంగణం వద్ద వాహన పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. సభ పూర్తయ్యే వరకు ఆయన అక్కడే ఉండనున్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చెన్నై ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో ఈనెల 7వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సెంటర్ ఛైర్మన్ ఎస్వీ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నై ప్రైమ్ ఇండియా ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొంటారన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ కన్నన్‌తోపాటు మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ కొత్తం దారామెన్, డాక్టర్ శ్రీరామ్, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ వేలు మురగన్, నరాల వ్యాధి నిపుణులు డాక్టర్ శ్రీవర్ధన్‌తో పాటు గర్భకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ చిత్ర భాస్కరన్‌లు పాల్గొంటారన్నారు. ఈ వైద్య శిబిరానికి వచ్చే రోగులు తమ మెడికల్ రిపోర్టులను తీసుకు రావాలని సూచించారు. లివర్ పరీక్షలతో పాటు ఈసీజీ, బీపీ, షుగర్ వైద్య పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తుమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నై ప్రైమ్ ఆసుపత్రి నిర్వాహకులు దామెదర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆరోగ్యశ్రీని ప్రైవేటు పరం చేయొద్దు

ఉలవపాడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల పర్యవేక్షణ బాధ్యతలను ప్రయివేటు సంస్థలకు ఇవ్వాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా కంపెనీలకు అప్పగిస్తూ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



బ్రిటీష్ కాలం నాటి
చెక్కుచెదరని తూము

వేలాది ఎకరాలకు సాగు నీరందించే బ్రిటీషుకాలం నాటి కాలువ తూము ఇప్పటికీ చెదరలేదు. బ్రిటీషు కాలం నాటిదైనా నేటికీ రాజసం ఉట్టిపడుతోంది. కోవూరు చెరువు నుంచి వెల్లవ కాలువ, కలుజు కాలువలకు నీరు ప్రవహించేందుకు వీలుగా గిరిజనకాలనీకి వెళ్ళే డొంక ప్రాంతంలో అప్పట్లో తూము ఏర్పాటు చేశారు. అవసరమైనంత మేర నీరు పారే విధంగా తూముకు చెక్కల్ని నిర్మించారు. ఏ వారం ఎంత నీరు ప్రవహించాలో తెలియచేస్తూ నీటిపారుదల శాఖాధికారులు అప్పట్లోనే లెక్క కట్టి తూము నిర్వహణ చేపట్టారు. ఇప్పటికీ అదే విధానంతో వేలాది ఎకరాలకు ఈ తూము గుండానే సాగు నీరందుతోంది. అయితే ఈ తూముకు ఇరువైపులా ఇటీవల కాలంలో పిచ్చి చెట్లు మొలిచాయి. వాటిని తొలగించాల్సిందిగా రైతులు కోరుతున్నారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

కోవూరు చెరువు నుంచి వచ్చే వెల్లువ కాలువ తూము

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని శైవ క్షేత్రాల్లో శుక్రవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. నెల్లూరులోని మూలస్థానేశ్వర ఆలయంలో ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి నవావరణ పూజలు జరిగాయి. సాయంత్రం నందీశ్వరునికి విశేష అభిషేకాలు, వెండి నందిసేవ జరిగాయి. ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు పర్యవేక్షించారు.

● రాజరాజేశ్వరి ఆలయంలో ఉదయం సామూహిక రాహుకాల ఉద్వాపన పూజలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చండీహోమం, సుందరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం సుందరేశ్వరస్వామికి, నందీశ్వరునికి పాలాభిషేకం, పంచామృతాభిషేకాలు జరిగాయి. రాజరాజేశ్వరి అమ్మవారికి కుంభహారతులు, పల్లకీసేవ వైభవంగా జరిగాయి.



● రేపు ఆలయం మూత

చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సాయంత్రం 4.30 గంటల నుంచి రాజరాజేశ్వరి ఆలయాన్ని మూసివేస్తామని ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. 8వ తేదీ ఉదయం సంప్రోక్షణ, స్నపన తిరుమంజనం జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం నిత్య కైంకర్యాలు జరిపి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామని వివరించారు.

రాజరాజేశ్వరి ఆలయంలో పూజలకు హాజరైన భక్తులు



మూలస్థానేశ్వరాలయంలో నంది వాహనంపై ఆదిదంపతులు

గురితప్పని మణి

మారుమూల పల్లెలో రైతు కుటుంబానికి చెందిన ఓ యువకుడు ఆర్చరీలో దూసుకుపోతున్నాడు. బాణం వేశాడంటే పతకం రావాల్సిందే అన్నట్టుగా ప్రతిభ చాటుతున్నాడు. ఆ విలుకాడే లింగసముద్రం పంచాయతీ వాకమళ్లవారి పాలెం గ్రామస్థుడు గొర్రెపాటి మణిదీప్ రెడ్డి. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి ఇప్పటికే ఎన్నో పతకాలు సాధించాడు. వాటిలో 16 స్వర్ణ పతకాలు ఉండటం విశేషం. అంతేకాదు అమెరికాలో జరిగిన పోటీల్లోనూ రాణించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేస్తున్న బాణధారి ఈ మణిదీపుడు.



- ● బాణం వేశాడంటే పతకం రావాల్సిందే!
- ● ఆర్చరీలో దూసుకుపోతున్న లింగసముద్రం యువకుడు
- ● 16 బంగారు పతకాలు సొంతం

ప్రతిభ

- ● రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణింపు
- ● అమెరికాలో పోటీలకూ హాజరు

రైతు కుటుంబంలో జన్మించిన మణిదీప్ 2014లో కడపలోని స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో చేరాడు. అక్కడే విలువిద్యలో శిక్షణ ప్రారంభించాడు. ఆ క్రీడా పాఠశాలలోనే ఇంటర్మీడియట్ వరకు చదివి ప్రస్తుతం విజయవాడలోని శాతవాహన కాలేజీలో బీపీ చదువుతున్నాడు. విలువిద్యపై ప్రత్యేక శ్రద్ధపెట్టి 5వ తరగతి నుంచే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. 2015-16 నుంచి 2023-24 సంవత్సరాల మధ్య జిల్లా స్థాయిలో పలు ప్రాంతాల్లో జరిగిన అండర్-10, అండర్-14, సబ్ జూనియర్, జూనియర్ విభాగాల పోటీల్లో పాల్గొని 16 బంగారు పతకాలు సాధించాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి క్రీడా ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాడు. అమెరికాలో లాస్‌వేగాస్‌లో రెండు సార్లు జరిగిన పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. అయితే గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఆ విలుకాడు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు స్పాన్సరర్ కోసం ఎదురు చూస్తున్నాడు. ఎవరైనా ముందుకు వచ్చి ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడానికి సిద్ధమవుతున్నాడు.

- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి)



అమరావతి చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి శాప్ చైర్మెన్ రవినాయుడు నుంచి బంగారు పతకం, ట్రోఫీ అందుకుంటున్న మణిదీప్‌రెడ్డి టీం

పోటీలు - పతకాలు



- ● మణిదీప్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో 2016-17 నుంచి 2024-25 సంవత్సరాల మధ్య సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ స్థాయిలో జరిగిన ఆర్చరీ పోటీల్లో పాల్గొన్నారు. 4 బంగారు, 4 రజత, 1 కాంస్య పతకం సాధించారు. ఉత్తమ ప్రదర్శనకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు.
- ● జాతీయ స్థాయిలో 2015-16 నుంచి 2023-24 సంవత్సరాల మధ్య ఖేలో ఇండియా సౌత్ నేషనల్, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ, సీనియర్ నేషనల్, నేషనల్ స్కూల్ గేమ్స్, మినీ నేషనల్ ఆర్చరీ పోటీల్లో పాల్గొన్నారు. ఒక బంగారు పతకం, ఒక కాంస్య పతకం సాధించారు.
- ● గత నెల 21 నుంచి 28 వరకు రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలో నిర్వహించిన అమ రావతి చాంపియన్‌షిప్ పోటీల్లో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో రెండు బంగారు పతకాలు, వ్యక్తిగత విభాగంలో ఒక రజత పతకం సాధించారు.
- ● గత ఏడాది ఫిబ్రవరిలో ఇండియా తరపున ఓల్డా ఆర్చరీ అకాడమీ వారు అమెరికాలోని లాస్‌వేగాస్‌లో వేగా షూట్ ఆర్చరీ టోర్నమెంట్ నిర్వహించగా జూనియర్ విభాగంలో మణిదీప్‌రెడ్డి పాల్గొని 5వ స్థానంలో నిలిచారు.
- ● ఈ ఏడాది మార్చిలో అక్కడే జరిగిన అదే టోర్నమెంట్‌లో సీనియర్ విభాగంలో పాల్గొన్నారు.

ఇండోసోల్ ప్రతినిధులపై దాడి

● కేసు నమోదు

ఉలవపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ కంపెనీలో డిజిటల్ మీడియా పనులు నిర్వహిస్తున్న వారిపై కరేడు గ్రామానికి చెందిన సుమారు 20 మంది దాడిచేసి బెదిరించిన సంఘటపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. ఇండోసోల్ కంపెనీలో డిజిటల్ మీడియాలో విధులు నిర్వహిస్తున్న మునీశ్వర అతని సహచరులు మరో ఐదుగురు కరేడు గ్రామంలో ఓరుగంటమ్మ గుడి ప్రాంతంలో గురువారం సాయంత్రం సర్వే నిర్వహిస్తుండగా సుమారు 20 మంది గ్రామస్థులు వచ్చి గొడవపడి చంపేస్తామంటూ బెదిరించారని, కంపెనీ బాధ్యతలు నిర్వహిస్తున్న తమను బెదిరించిన వ్యక్తులను విచారించి వారినుంచి రక్షణ కల్పించాలని స్థానిక పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు.

రోడ్డుపై గుంత.. వాహనదారుల చింత...

ఉదయగిరి, సెప్టెంబు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోంపల్లి, కరీమా వీధులకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న గుంత ప్రమాదాలకు కారణమవుతోంది. మురుగు కాలువపై ఏర్పాటుచేసిన సిమెంట్ అచ్చులు ధ్వంసం కావడంతో రహదారి మధ్యలో గుంత ఏర్పడింది. సమీపానికి వెళ్లేవరకు కనిపించక పోవడంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు.



రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్
కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : నగరంలోని భక్తవత్సలనగర్‌లో ఉన్న పెన్షనర్స్ భవన్‌లో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం.గౌస్ అధ్యక్షత జరిగింది. ముందుగా ఆయన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలు వివరించారు. పెన్షనర్స్ సమస్యల పట్ల రాష్ట్ర సంఘం తీసుకుంటున్న చర్యలు అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ.వెంకటేశ్వర్లు వివరించారు. ఒక సంఘం నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పెన్షనర్స్ సంఘం గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం వివరించారు. కొత్తగా రిటైర్డు అయిన ఉద్యోగులు పెన్షనర్స్ సంఘంలో చేరి బాధ్యతలు స్వీకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. గౌరవాధ్యక్షుడుగా మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, అధ్యక్షుడుగా ఎస్ఎం.గౌస్, సహ అధ్యక్షుడుగా ఎన్.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌పీవీఎస్ మూర్తి, కోశాధికారిగా జే.హజరత్తయ్య, కార్యనిర్వహక కార్యదర్శిగా సీహెచ్ రఘునాథ్, 7మంది ఉపాధ్యక్షులు, 7మంది సహాయ కార్యదర్శిలతోపాటు 35 మంది కార్యవర్గ సభ్యులు, డివిజన్ కార్యదర్శులు, గౌరవ సలహాదారులను ఏకగ్రీవంగా ఎనున్నకున్నారు. నూతన కార్యవర్గంతో విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రమాణ స్వీకారం చేయించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ జిల్లా కార్యవర్గం

నిలువ నీడ కరువాయె..!

ఉదయగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో బస్సుల కోసం వేచి ఉండేందుకు ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. ప్రధానంగా సీతారామపురం, గండిపాళెం మార్గాల్లో ఎలాంటి బస్‌షెల్టర్లు లేవు. నెల్లూరు మార్గంలో బస్‌షెల్టర్ ఉన్నా యాచకులకు నిలయంగా మారడం, అపరిశుభ్రతగా తయారైంది. దీంతో ప్రయాణికులు ఆరుబయట ఎండలో, దుకాణాల వద్ద తలదాచుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికులకు నీడ సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.



విద్యాభివృద్ధికి బాధ్యతతో పని చేయాలి

- **● సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు : కలెక్టర్ ఆనంద్**
- **● గురుపూజోత్సవంలో 38 మంది టీచర్లకు అవార్డులు, సత్కారం**

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేసి విద్యాభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న తిక్కన ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో గురుపూజోత్సవ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. రానున్న పదేళ్లలో విద్యావ్యవస్థలో రానున్న సమూల మార్పులను దృష్టిలో ఉంచుకుని టీచర్ల శిక్షణ పొంది విద్యార్థులకు విద్యనందించాలన్నారు. జిల్లాలోని మోడల్ ప్రైమరీ స్కూల్స్ వ్యవస్థను విజయవంతంగా నడిపించే బాధ్య త ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ప్రైవే ట్, ప్రభుత్వ పాఠశాలలు సమన్వయంతో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పిల్లలందరూ ఉన్నతంగా ఎదిగేందుకు పూర్తిస్థాయి ప్రోత్సాహం, సహకారంతోపాటు నాణ్యతతో కూడిన విద్యనందించాలని సూచించారు. తాను కూడా విద్యాశాఖపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ గురుతత్వాన్ని స్మరించుకుంటూ ఉపాధ్యాయులు విద్యారంగం ఉన్నతికి పాటుపడాలన్నారు. పెరిగిన ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు సాంకేతిక బోధన అందించాలన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి పదవులను అలంకరించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాంలను టీచర్లు ఆదర్శంగా తీసుకుని వారి బాటలో పయనించాలన్నారు. తన వంతు విద్యాభివృద్ధికి ఏసీనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 38 మందిని ఘనంగా సత్కరించి అవార్డులు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయ్‌కుమార్, డీఈఓ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి

● జిల్లా కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ ఆనంద్ సూచించారు. నగరంలోని ఎస్‌వీజీఎస్ కల్యాణ మండపంలో శుక్రవారం అప్సా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంలో బోధనలో కూడా వినూత్న పద్ధతులు అవలంబిస్తూ బోధించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ మరింత బాధ్యతతో వ్యవహరించి విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని తెలిపారు. తొలుత ఆయన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనం తరం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే 2,500 మంది ఉపాధ్యాయులను సత్కరించి మెమెంటోలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయ భాస్కర్ రెడ్డి, అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు సింహారావు, అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నందకిషోర్ పాల్గొన్నారు.



టీచర్‌ని సత్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్

ఉత్తమ గురువులకు పురస్కార సత్కారం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవంలో జిల్లావ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 38 మందిని కలెక్టర్ ఆనంద్, అధికారులు ఘనంగా సత్కరించి పురస్కారాలు అందచేశారు.



చిత్తూరు వెంకటేశ్వర్లు (కందుకూరు)ను సత్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, నుడా చైర్మన్ కోటంరెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు



టి.సుబ్రహ్మణ్యం	షేక్ ఫాతిమజన్	కె.రమేష్	సీహెచ్.శివశంకర్
బీ.రామమోహన్	షేక్ కరిముల్లా సాహెబ్	కెవి.రమణరెడ్డి	డి.మాలకొండయ్య
జి.వెంకటేశ్వర రావు	గీత మాధురి	డి.శ్రీనివాసులు	ఎ.వెంకటేశ్వర రావు
ఎం.వెంకటకృష్ణయ్య	రాజ్‌కుమార్	ఎం.రమణ కుమార్	గింజి శ్రీనివాసులు
శ్రీలం లక్ష్మి శ్రీదేవి	రమేష్‌బాబు	కామినేని పద్మజ	నెల్లూరు కల్యాణ్
మధుసూదన్‌రావు	జనిగర్ల శ్రీనివాసులు	రత్నయ్య	జమ్మల నరసింహయ్య
రామ కొండప్పనాయుడు	వారణాసి భాస్కర్	లెక్కల శ్రీనివాసులు	శ్రీలత
ఓంకారం శ్రీనివాస రాజు	రాచూరి ఆదెయ్య	ఎ.మురళీమోహన్	వి.ఫణీంద్ర మోహన్
ఖాదర్ బాషా	షాహెద అక్తర్	దినారి ప్రభాకర్	

పంచాయతీలకు నిధుల మంజూరు

ఉదయగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17 పంచాయతీలకు టైడ్, అన్‌టైడ్ నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో అప్పాజీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా పంచాయతీలకు రూ.62,47,961 లక్షల టైడ్, రూ.41,65,320 లక్షల అన్‌టైడ్ నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈనిధులతో పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు పారిశుధ్యం, తాగునీటి వసతులకు వ్యయం చేయాలని ఆయన సూచించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10114
వెండి కిలో ధర	రూ. 126900
వెండి ఒక గ్రాము	రూ. 129.90



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ అశోక్, పీహెచ్‌సీ వైద్యాధికారి

సంగం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అశోక్ సూచించారు.

? వర్షాకాలంలో వచ్చే వ్యాధులు ఏమిటి. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

! వర్షాకాలంలో పారిశుధ్యం లోపించి దోమలు పెరిగి డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. నివారణకు పరిసరాల పరిశుభ్రతతోపాటు టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాల్లో నీళ్లు నిల్వ చేరకుండా చూసుకోవాలి. రాత్రి వేళల్లో దోమ తెరలు వాడాలి.

? పీఎంజేఏవైసీ వల్ల ఉపయోగాలు ఏమిటి.

! పీఎంజేఏవైసీ (ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కార్డు) వల్ల కుటుంబానికి ఏడాదికి రూ. 5 లక్షల బీమాతోపాటు కార్పొరేటు వైద్యశాలల్లో ఉచితంగా చికిత్స చేయించుకోవచ్చు.

? ప్రతిరోజు పీహెచ్‌సీకి ఎంత మంది రోగులు వస్తున్నారు. అవసరమైన అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయా.

! వైద్యశాలలో 24 గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. వైద్యశాలకు ప్రతిరోజు 70 నుంచి 80 మంది రోగులు వస్తుంటారు. అవసరమైన అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

? పీహెచ్‌సీలో అత్యవసర కేసులకు చికిత్స జరుగుతుందా, రక్త పరీక్షలు చేస్తున్నారా.

! అన్నిరకాల అత్యవసర కేసులకు ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేస్తాం. 14 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం.

న్యూస్ బాక్స్

ఘనంగా గణనాథుడి గ్రామోత్సవం



గణనాథుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సంగం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్డెరపాళెం, ముత్తరాశిపాళెంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుడిని గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్త్రీశక్తి విజయోత్సవ సభ జయప్రదం చేయాలి

సీతారామపురం, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో వింజమూరు మండల కేంద్రంలోని ఆర్‌టీసీ బస్టాండ్ కూడలి నుండి ఎస్‌వి కన్వెన్షన్ హాల్ వరకు మహిళల భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు మండల కోర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం స్త్రీ శక్తి విజయోత్సవ సభ జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని మండల మహిళా నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు.

నేడు గిరిజనులకు ప్రత్యేక గ్రీవెన్స్

కలువాయి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఉదయం 10గంటలకు డివిజన్ పరిధిలోని గిరిజనుల రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమం జరుగుతుందని ఇన్‌చార్జి తహసీల్దారు వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించని మరుగుదొడ్లు

మహిళల అవస్థలు ● పట్టించుకోని అధికారులు

సీతారామపురం, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ పేరుతో మరుగుదొడ్ల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించే అధికారులు తమ కార్యాలయాలపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేకపోవడం.. ఉన్నా అధ్వానంగా తయారవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనులపై వచ్చే కార్యార్థులు అత్యవసరమైతే ఆరు బయటకు పరుగులు తీయాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సీతారామపురంలో మండల పరిషత్, తహసీల్దార్, వ్యవసాయ శాఖ, వెలుగు, విద్యాశాఖ, ఉపాధి హామీ కార్యాలయాలతో పాటు రైతుసేవా కేంద్రం, ప్రభుత్వ హాస్పటల్, పశువైద్యశాల ఒకే ప్రాంగణంలో ఉన్నాయి.



మరుగుదొడ్లు లేని ప్రభుత్వ కార్యాలయాల భవనం

ఈకార్యాలయాలకు నిత్యం వివిధ పనులపై వందలాది మంది వస్తుంటారు. అయితే మండల కార్యాలయాల సముదాయంలో ప్రజామరుగుదొడ్లు లేవు. దీంతో అత్యవసరమైతే గోడ, చెట్ల చాటుకువెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటిని ఉద్యోగులు మాత్రమే వాడుతున్నారు. మరికొన్ని కార్యాలయాల్లో నిర్వహణ లేక అధ్వానంగా తయారవడంతో ఉద్యోగులు కూడా ఆరు బయటే మూత్ర విసర్జన చేస్తున్నారు. ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని చెప్పే అధికారులు సొంత కార్యాలయాల్లో వాటి నిర్వహణపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైభవంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ఏఎస్‌పేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏఎస్‌పేటతో పాటు అనుమసముద్రం, రాజవోలు, గుంపార్లపాడు, హసనపురం తదితర గ్రామాలలో శుక్రవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ పేటలో ముస్లీంలు నిషాని జెండాను ఊరేగింపుగా తీసుకొని దర్గా సెంటర్ నుంచి గ్రామంలోని అన్ని వీధులలో తిరిగి బురుజు వద్దకు తీసుకెళ్లి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వేలాదిగా ముస్లీంలు పాల్గొన్నారు.



ఏఎస్‌పేటలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు



ఉదయగిరి: ఖురాన్ సందేశమిస్తున్న మతపెద్దలు

●**ఉదయగిరి:** మిలాద్ ఉన్ నబీ వేడుకలను శుక్రవారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని చిన్న, పెద్ద మసీదులతోపాటు ఖాదరీయా ఆస్థానాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి భారీ కేకులు కట్ చేశారు. ప్రవక్త చిహ్నాలను ప్రదర్శించడంతోపాటు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మత పెద్దలు ఖురాన్ సందేశం ఇచ్చారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వమానవాళికి ఆదర్శంగా అని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పట్టణంలో శాంతియుత ర్యాలీ చేపట్టారు. పలుచోట్ల భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా దర్గాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

● **దుత్తలూరు:** మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మండలంలోని నందిపాడు, నర్రవాడ, ఏరుకొల్లు, వెంకటంపేట గ్రామాలతోపాటు దుత్తలూరులో ముస్లింలు మసీదులు, దర్గాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు ఖురాన్ సందేశమిచ్చి అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు.

●**వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) :** మండలంలో మిలాద్- ఉన్- నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తూర్పుబోయమడగల, జడదేవి, వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి, రామాపురం, హుస్సేన్‌నగర్, విరువూరు, కొత్తపల్లి, తోటలచెరువుపల్లి తదితర గ్రామాల్లోని ముస్లీంలు దర్గాలు, మసీదులకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈసందర్భంగా మత పెద్దలు ఖురాన్ ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు సైతం నివాసాల్లోనే ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఉదయగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సన్మానం

●**కలువాయి:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన వారిని ఘనంగా సన్మానించారు. వల్లూరు కృష్ణారెడ్డి, ఆర్‌వీ.కృష్ణారెడ్డి, డి.ఓబులమ్మను శాలువాలతో సత్కరించారు. వీరితో పాటు మండల విద్యాశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న టీ యానాదయ్య, కృష్ణయ్యలను కూడా సన్మానించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ బి అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, చల్లా రఘురామిరెడ్డి, ఎంఈవో పద్మనాభం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జీవీ మురళీకృష్ణ, నారాయణరెడ్డి, మస్తాన్‌బాబు, సీహెచ్ రమణారెడ్డి, పెంచలరావు, ప్రసన్నకుమార్, సుధాకర్, సీఆర్‌ఎంటీ నాగేశ్వరావు, పాల్గొన్నారు.

●**సీతారామపురం:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సీతారామపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మార్కాపురం వెంకటసుబ్బయ్యను శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రవీణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంగయ్య, అంజాద్ అహ్మద్‌బాష, జయరామిరెడ్డి, గౌస్‌బాషా, విద్యార్థులు, విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.



ఉదయగిరి: రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

●**ఏఎస్‌పేట:** స్థానిక ఎంఈవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు జ్యోతి, సాయిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కలువాయి: గురువులను సన్మానిస్తున్న జడ్పీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ తదితరులు



ఏఎస్‌పేట : ఎంఈవో కార్యాలయంలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు, అధికారులు



సీతారామపురం: ఉత్తమ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బస్సులు లేకుండా ప్రయాణమెలా సారూ..



ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్త్రీశక్తి పథకాన్ని అమలుచేసినప్పటికీ పల్లె ప్రాంతాల మహిళలు ఆ పథకాన్ని వినియోగించుకునే అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు. మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి కన్పిస్తోంది. ఉదయగిరి నుంచి వరికుంటపాడు మండలంలోని పలు గ్రామాల మీదుగా ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్లే మార్గంలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు లేకపోవడంతో ఆ ప్రాంతంలో ఆటోలే దిక్కుగా మారాయి. విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని యర్రంరెడ్డిపల్లి మీదుగా నడిపే సర్వీసును సెలవుదినాల్లో నిలిపి వేస్తుండడంతో ఉన్న ఒక్కగానొక్క బస్సు కూడా లేకపోవడంతో మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయగిరి నుంచి పెద్దిరెడ్డిపల్లి, గువ్వాడి మీదుగా పామూరుకు వెళ్లే బెంగళూరు, విజయవాడ బస్సులు హైటెక్ సర్వీసులు కావడంతో పథకం వర్తించే పరిస్థితి లేదు. అంతేగాక వెంగళరావునగర్, గుడినరవ, తోటలచెరువుపల్లి, ఆర్లపడియ తదితర గ్రామాల మహిళలు అటు ఉదయగిరి, ఇటు పామూరు పట్టణాలకు ప్రయాణాలు సాగించాలంటే ఆ బస్సులతో పాటు ఆటోల్లో అధిక నగదు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లె ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని కట్ సింగిల్ బస్సు సర్వీసులను కొనసాగించాలని కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

సంగం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అగ్రికల్చర్ విజిలెన్స్ అధికారి టి వేణుగోపాల్‌రావు, డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ విష్ణురావు దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎరువుల నిల్వలు, పురుగు మందులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా తదితర ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, ఎంఆర్పీ ధర కంటే అధికంగా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఏవో శశిధర్ ఉన్నారు.



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

పీఏసీఎస్ కమిటీ సభ్యుల బాధ్యతల స్వీకరణ

సంగం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు పీఏసీఎస్‌కి నియమించబడ్డ కమిటీ సభ్యులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చైర్‌పర్సన్‌గా బండా హరికిషోర్‌రెడ్డి, డైరెక్టర్లుగా ఎం కృష్ణయ్య, జడపల్లి దయాకర్‌లను నియమించిన విషయం విదితమే. ఆమేరకు వారు బాధ్యతలు స్వీకరించారు. ఎంపికైనవారిచే సీఈవో వెంకటరమణయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారిని సిబ్బంది ఘనంగా సత్కరించారు.



పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లను సత్కరిస్తున్న సిబ్బంది

కుక్కల బెడదతో ప్రజలు బెంబేలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే ఆ రహదారిలో ప్రయాణాలు సాగించాలంటేనే ప్రజలు హడలెత్తి పోతున్నారు. ఉదయగిరి, వరికుంటపాడు మండలాల సరిహద్దు గ్రామమైన గండిపాళెంలో ఇలాంటి పరిస్థితి చోటు చేసుకుంది. ప్రధాన రహదారిలో దారి పొడవునా కుక్కలు గుంపులుగా సంచరిస్తూ రోడ్డుపైనే తిష్ట వేస్తుండడంతో అటుగా వెళ్లే ప్రజలు భయాందోళనతో బెంబేలెత్తిపోతున్నారు. సమీపంలోనే ఉన్నత, గురుకుల పాఠశాలలు ఉండడంతో ప్రతినిత్యం పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని పరుగులు తీయాల్సి వస్తుందని వాపోతున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు చేసేదేమిలేక తమ పిల్లలను భద్రంగా పాఠశాలలకు తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అంతేగాక పెట్రోల్ బంకు, బ్రాంది షాపు, ఇతర వ్యాపార సముదాయాలు కూడా అటువైపే ఉండడంతో ప్రజల రద్దీ అధికంగానే ఉంటుంది. చిన్నపాటి పనులకు సైతం గ్రామంలోకి పరుగులు తీసే ఎస్సీ కాలనీ వాసులు సైతం ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. కాలినడకన వెళ్లే వారితో పాటు ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తుండడంతో ఎక్కడ జారి పడాల్సి వస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు లేకపోవడంతో మహిళలు, వృద్ధుల పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రహదారిపైనే తిష్ట వేసిన కుక్కలు

C.R.I.M.E N.E.W.S

బహిర్భూమికి వెళ్లి మత్స్యకారుడి మృతి

బిట్రగుంట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ తూర్పు తీరప్రాంతం పాత కడపాలెంకు చెందిన చిన్నంగారి అంజయ్య (51)బహిర్భూమికి వెళ్లి మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంజయ్య ఇతర రాష్ట్రాల్లో చేపల వేటతో కుటుంబాన్ని పోషించుకునేవాడన్నారు. ఇటీవల అనారోగ్యం కారణంగా ఇంటి వద్దే ఉంటున్న అంజయ్య బహిర్భూమికి వెళ్లి చిల్లచెట్ల వద్ద మృతి చెందినట్లు భార్య పోలమ్మ తెలిపిందన్నారు. కావలి రూరల్ సీఐ పాపారావు, ఎస్‌ఐ ప్రభాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.



అంజయ్య మృతదేహం

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి ..

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వేదాయపాలెం -వెంకటాచలం రైల్వే స్టేషన్‌ల మధ్య పడారుపల్లి ప్రాంతంలో గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. మృతుడు 35-40 ఏళ్ల మధ్య వయస్సు కలిగి నలుపురంగు కట్ బన్నియన్, గోధుమ రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ సీఆర్పీఎఫ్ జవానుపై దాడి

వెంకటాచలం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లి పంచాయతీ ముత్యాలగుంటలో గురువారం రాత్రి వాలంటరీ రిటైర్డ్ సీఆర్పీఎఫ్ జవాన్‌పై ఐదుగురు వ్యక్తులు దాడిచేశారు. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొచ్చు రామయ్య సీఆర్పీఎఫ్ జవాన్‌గా వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ప్రస్తుతం స్థానికంగా సెక్యూరిటీ విభాగంలో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం రాత్రి గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా కొందరు యువకులు బాధితుడి కుమారుడు సాయితేజతో గొడవకు దిగారు. అప్పుడే విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన రామయ్య గొడవ జరుగుతున్న విషయాన్ని గుర్తించి తన కుమారుడిని ఇంట్లోకి పంపించి వేశాడు. అయితే కొద్దిసేపటి తర్వాత రామయ్యపై కర్రలు, రాళ్లతో ఐదుగురు వ్యక్తులు దాడి చేయడంతో రామయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ఆయనను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడ్డ బొచ్చు రామయ్య

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు రౌడీషీటర్ల అరెస్ట్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు రౌడీషీటర్లను దర్గామిట్ట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని పోస్టల్‌కాలనీ 6వ వీధిలో నివాసం ఉంటూ ప్రస్తుతం టెక్కేమిట్టలో ఉంటున్న మేరిగ ప్రవణ్ అలియాస్ చింటు, కనుపర్తిపాడుకు చెందిన చెముడుగుంట రవికిరణ్‌లు రౌడీషీటర్లు. వీరిద్దరు శుక్రవారం ఉదయం పొదలకూరు రోడ్డులోని క్యాన్సర్ వైద్యశాల సమీపంలో ప్రభుత్వ వైద్యశాల ప్రహరీగోడ రోడ్డు మార్జిన్‌లో చెట్టుకింద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యకు అందింది. ఆయన దాడులు చేసి ఇద్దరు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైకిళ్ల ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కలిగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కావలి- వింజమూరు జాతీయ రహదారిపై వీరన కొల్లు సమీపాన రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యారు. కొండాపురం మండలం బసినేనిపల్లికి చెందిన గురుప్రసాద్ మోటారు సైకిల్‌పై వెళుతుండగా, కలిగిరి మండలానికి చెందిన డేగా దొరబాబు మోటారు సైకిల్‌లో వెనుకనుండి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ 108 వాహనంలో వింజమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై వివరాలు సేకరించి, విచారణ చేపట్టినట్టు ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన దొరబాబు

సముద్రంలో ఇద్దరు యువకుల గల్లంతు

● సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన మెరైన్ పోలీసులు

కావలి రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం తుమ్మలపెంట సముద్రతీరంలో శుక్రవారం సాయంత్రం సముద్రస్నానం చేస్తూ ముసునూరుకు చెందిన పెద్దిపోగు దివాకర్, కిశోర్ అలల తాకిడికి కొట్టుకుపోయారు. వారిని గుర్తించిన మెరైన్ ఎస్‌ఐ జానకిరామయ్య కానిస్టేబుల్ బాలసుబ్రహ్మణ్యం, స్థానిక వ్యక్తి సముద్రంలో కొట్టుకుపోతున్న వారిద్దరినీ రక్షించారు. ఎస్‌ఐ బోటు పంపించడంతో యువకులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.



యువకులను కాపాడిన మెరైన్ పోలీసులు

రేషన్ అక్రమ రవాణాలో సూత్రధారులు ఎవరు?

అనంతసాగరం సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాగరం కేంద్రంగా రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. రెండు రోజుల క్రితం అక్రమ తరలింపునకు భారీగా సేకరించిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీసు, పౌర సరఫరాల శాఖ అధికారులు ఇనగలూరు వద్ద పట్టుకొన్న విషయం తెలిసిందే. కాగా ఇందులో సూత్ర, పాత్రదారులు ఎవరు? వారిని గుర్తించారా? వారిపై చర్యలు ఉంటాయా? అనే ప్రశ్నలు చర్చకు తెరలేపాయి. గత వైసీపీ హయాం నుంచి వెంగంపల్లికి చెందిన కొందరు నాయకులు, ముఠా సభ్యులు రేషన్ రవాణాలో చక్రం తిప్పుతున్నారు. ఇదే వ్యాపారంగా మలుచుకొని రూ.లక్షలు గడిస్తున్నారు. ఇందులో కొందరు రేషన్ డీలర్ల హస్తం కూడా ఉంది. పేదలకు ఇచ్చే సరుకులు లబ్ధిదారులకు ఇవ్వకుండా నామమాత్రంగా నగదు ఇచ్చి సీలు బస్తాలు బయటకు తరలించేస్తున్న వైనం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సుమారు 200 నుంచి 300 బస్తాల బియ్యం రహస్యంగా దాచి అక్రమ తరలింపునకు పూనుకోవడం అధికారుల నిఘా వైఫల్యానికి ఈ సంఘటన అద్దం పడుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 545

వినాయకుడి లడ్డూ రూ.1.82 లక్షలు

కందుకూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 14వ వార్డులో ఉన్న శ్రీరామ్‌నగర్ ఎస్సీ కాలనీలో వినాయకుడి లడ్డూ వేలం పాటలో రూ. 1.82 లక్షలు పలికింది. కాలనీలో ఏర్పాటుచేసిన వినాయకుడి నిమజ్జనోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి లడ్డూకు వేలం పాట నిర్వహించగా కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు, బిల్డర్ తలతోటి మస్తాన్ రూ. 1.82 లక్షలకు దక్కించుకున్నాడు. ఈసందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మస్తాన్‌ను అభినందించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏవీ?

- బహిరంగ మార్కెట్లో ధరలు ఢమాల్ ● మద్దతు ధర కంటే రూ.3 వేలు తక్కువ
- మద్దతు ధర రాకపోతే రూ.180 కోట్లు నష్టం
- సీఎంఆర్ కింద కొనుగోలు చేయాలంటున్న రైతులు

జలదంకి, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎడగారు వరిపంటలు కోతలకు వచ్చాయి. జిల్లాలో ఇప్పటికే అల్లూరు, కోవూరు తదితర మండలాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మిగిలిన మండలాల్లో కూడా మరో 10,15 రోజుల్లో కోతలు మొదలుపెట్టనున్నారు. బహిరంగ మార్కెట్లో ధాన్యం ధరలు దళారీలో పుట్టి (857కిలోలు) రూ.17 వేలు పలుకుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పుట్టి (850 కిలోలు) రూ.20 వేలు కాగా రూ. 3వేలు తగ్గించి కొంటున్నారు. సీఎంఆర్ ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయకపోవడంతో రైతన్నలు దళారీలకు తక్కువ ధరకు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎకరం పొలంలో మూడు పుట్ల ధాన్యం పండితే రైతులు ఎకరానికి రూ.9 వేలు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుకు లాభంగా మిగిలే రూ.9 వేలు దళారీల పాలవుతోంది. ఈ ధరలు చూసి రైతులు పెట్టుబడులు కూడా వస్తాయో.. రావోనని ఆందోళన చెందుతున్నారు. ఈ ఎడగారు సాగులో రైతులు ఎరువుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాక అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసి పైరుకు వేయాల్సి వచ్చింది. దీంతో అదనపు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. సాగునీరు పైరుకు సమృద్ధిగా అంది పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్న సంతోషం కాస్తా ధరల విషయంలో నీరుగారిపోయింది. జిల్లాలో 2 లక్షల ఎకరాలకు పైగా రైతులు వివిధ కాలువల కింద ఎడగారు వరి సాగు చేశారు. ఇలా 6 లక్షల పుట్ల ధాన్యం దిగుబడి రానుంది. ఇవే ధరలు కొనసాగితే రైతులు రూ.180 కోట్ల మేర మద్దతు ధర దొరక్క నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఉన్న ధర కంటే మరింతగా క్షీణించే అవకాశం ఉందని దళారీలే బహిరంగంగా చెబుతున్నారు. అదే జరిగితే రైతులకు మరింత నష్టం వాటిల్లనుంది. కలెక్టర్ స్పందించి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వ మద్దతు ధర దక్కేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సీఎంఆర్ కింద ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు, రైతుసంఘాల ప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.





కనుల పండువగా గణేశ్ గ్రామోత్సవం

కావలి(టౌన్)సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): కచ్చేరిమిట్టలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. కచ్చేరిమిట్ట గణేశ్ యూత్ నాయకుడు కావేటి శివ పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవాల్లో 10 రోజులు వినాయకుడికి విశేష పూజలు చేశారు. రెండుసార్లు అన్నదానం ఆనవాయితీని కొనసాగించారు. విద్యుద్దీపాలంకరణ, బ్యాండ్ మేళాలు, కోలాటాల నడుమ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముసునూరు మందాటి చెరువులో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. టీడీపీ 24వ వార్డు ఇన్‌చార్జ్ కావేటి కోటయ్య, 20వ వార్డు ఇన్‌చార్జ్ పెంచలయ్య, రమణయ్య, శేషగిరి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యకళాశాలలు ప్రైవేటు పరం చేయొద్దు

ఉలవపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల పర్యవేక్షణ బాధ్యతలను ప్రయివేటు సంస్థలకు ఇవ్వాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా కంపెనీలకు అప్పగిస్తూ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వమే స్వయంగా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్వహించడం వలన ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీ నుంచి పేద ప్రజలకు ఉపశమనం కలుగుతుందన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి గ్రామం నడిబొడ్డున్న సర్వే నెంబరు 78-1లో ఎ 3-20 సెంట్లు చుండి రామలింగేశ్వర స్వామి, మహలక్ష్మమ్మ అమ్మవారి ఆలయ భూమి ఆక్రమణలకు గురవుతోందని చుండి మాజీ ఉపసర్పంచ్ కామినేని వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కోట్ల రూపాయల విలువ కలిగిన భూమిని కొంత మంది గ్రామస్థులు ప్రహరీ గోడలు నిర్మించి రేకులషెడ్లు వేసి ఆక్రమించుకుంటున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని వీరయ్య కోరారు.

కంప చెట్ల తొలగింపు

బిట్రగుంట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం చెరువు గట్టు పక్కనున్న పొలాలకు వెళ్లే దారిలో కంపచెట్లను చెరువునీటి సంఘం అధ్యక్షులు కాండ్ర వేణుగోపాల్ శుక్రవారం తొలగింపు పనులు చేపట్టారు. రెండో పంట కోత సమయం దగ్గర పడంతో కంప చెట్లు రోడ్డుపై వాలి పాములు సంచరిస్తున్నట్లు రైతులు తెలిపారన్నారు. అంతే కాకుండా శ్మశానవాటికు వెల్లే దారి కావడంతో స్థానికులు, రైతుల కోరిక మేరకు ఎక్స్‌కవేటర్‌తో ముళ్ళపొదలు తొలగించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కాండ్ర రఘురామనాయుడు, మల్లికార్జున పాల్గొన్నారు.



కంపచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

అవినీతికి అదే 'బేస్'!

(5వ పేజీ తరువాయి)

డబ్బులు సరిపోవు. పోనీ కొత్తవారితో మిగిలిన పనులు చేయిద్దామా.. అంటే గిట్టుబాటు కాదని వారు వెనకడుగు వేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాటి హౌసింగ్ అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. కాగా కొన్నిచోట్ల బేస్‌మెంట్‌లు కూడా నిర్మించకుండానే అధికారులు బిల్లులు చెల్లించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఇలా కట్టిన నిర్మాణాలకు, చెల్లించిన మొత్తాలకే భారీ తేడా ఉందని గుర్తించి విజిలెన్స్ విభాగం సుమారు రూ.110 కోట్లు జిల్లాలో దుర్వినియోగమైనట్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.

ప్రవక్త బోధనలు ప్రపంచానికి వెలుగు

● మిలాదున్ నబీ ఉత్సవంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి(టౌన్) సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచానికి వెలుగని ఎమ్మెల్యే డీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మిలాదున్ నబీ పర్వదినం పురస్కరించుకుని హిందూ, ముస్లింలు నిర్వహించిన ఉత్సవంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొని జెండా చెట్టు సెంటర్ వద్ద ర్యాలీని ప్రారంభించారు. పచ్చ జెండా చేతబట్టి ర్యాలీలో పాల్గొని అందరినీ ఉత్సాహపరిచారు. బీపీఎస్ కూడలి వద్ద ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సర్వ మానవ కల్యాణం కోసమే జన్మించారన్నారు. ఆదర్శ మానవ జీవన విధానానికి మార్గదర్శకులయ్యారన్నారు. ఆయన బోధనలు ఆచరణీయమని, మతసామరస్యానికి ప్రతీక మహమ్మద్ ప్రవక్త అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. ర్యాలీలో ఏఎంసీ చైర్‌పర్సన్ అలేఖ్య, టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ కిశోర్, బాబురావు, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు ముస్లిం యువత తదితరులు పాల్గొన్నారు.



ముస్లింల ర్యాలీలో ఎమ్మెల్యే, నాయకులు

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

కందుకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని శుక్రవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని జామియా మజీద్‌లో టీడీపీ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు విందుభోజనం ఏర్పాటుచేశారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఉలవపాడు, సెప్టంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిలాద్-ఉన్-నబీ వేడుకలను మండలంలోని ముస్లీంలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ముస్లీం పెద్దలు స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేపట్టారు.

పార్టీ కోసం శ్రమించినవాళ్లకే పదవులు

● ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): కావలి సొసైటీ చైర్మన్‌గా కాటా భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లుగా సోమయ్యగారి రమణ, కమతం ప్రసాద్‌లు శుక్రవారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. పాతూరు శివాలయం పక్కన ఉన్న కల్యాణ మండపంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడినవారికి పదవులలో ప్రాధాన్యత ఇచ్చామన్నారు. కావలి సొసైటీ ద్వారా రైతులకు సేవలు అందించాలన్నారు. రైతులు సొసైటీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ నేతలు జ్యోతి బాబూరావు, ఆవుల రామక్రిష్ణ, జనిగర్ల హేంద్ర, కండ్లగుంట మధుబాబు నాయుడు, పొట్లూరు శ్రీనివాసులు, దగుమాటి మాల్యాద్రి రెడ్డి, పీ. మధుసూదనరెడ్డి, చిలకపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా 31 మంది లబ్దిదారులకు రూ. 18,07,248 చెక్కులను పంపిణీ చేశారు. ఇప్పటివరకు సీఎం సహాయనిధికి 902 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 587 మందికి రూ.5,44,41,980 అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



కావలి సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కాటా భాస్కర్

వైసీపీ రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా హనుమంతరావు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా వలేటివారిపాలెంకు చెందిన కట్టా హనుమంతరావు, జిల్లా బీసీసెల్ ప్రధాన కార్యదర్శిగా ఇరపని అంజయ్యను నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షుడి నుంచి ఆదేశాలు జారీ అయినట్లు మండల వైసీపీ అధ్యక్షుడు అనుమోల లక్ష్మీనరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హనుమంతరావు, అంజయ్యలు మాట్లాడుతూ జిల్లా కమిటీలో అవకాశం కల్పించినందుకు పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాని గోవవర్దన్‌రెడ్డికి, కందుకూరు నియోజకవర్గం ఇన్‌చార్జి బుర్రా మధుసూధన్‌యాదవ్‌కు, మండల వైసీపీ కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహంకు కృతజతలు తెలిపారు.

● కార్యనిర్వాహక సభ్యుడిగా పోతులూరయ్య

లింగసముద్రం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా రైతు వింగ్ కార్యనిర్వాహక సభ్యుడిగా మండలంలోని పెంట్రాలకు చెందిన కొమ్మి పోతులూరయ్య నియమితులయ్యారు. ఈమేరకు కందుకూరు వైసీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. తనను ఎదవిలో నియమించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కందుకూరు పార్టీ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదనరావు, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జమునకు సాహితీ పురస్కారం



మండలి బుద్ధప్రసాద్ నుంచి పురస్కారమందుకుంటున్న జమున

కావలి(టౌన్), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని రామమోహన గ్రంథాలయంలో జరిగిన గురుపూజోత్సవంలో కావలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని ఎన్ జమున సాహితీ పురస్కారం అందుకున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంసీ దాస్, పూర్ణచంద్ర గాంధీ, విశ్రాంత వీసీ వియాన్నరావు, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు చేతుల మీదుగా జమున పురస్కారం అందుకున్నారు.

సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో...

స్థానిక వెంగళరావునగర్‌లోని కార్యాలయంలో సంయుక్త సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర ఆధ్యక్షతన శుక్రవారం గురుపూజోత్సవ సభ నిర్వహించారు. డాక్టర్ బెజవాడ రవికుమార్ పాల్గొని గురువులను సత్కరించారు. సత్కారమందుకున్న ఉపాధ్యాయుల్లో ప్రసాదరావు, ఖాదర్‌బాషా, కల్యాణి, అజిత్‌బాబు, శివప్రసాద్ రెడ్డి, సాయి తేజ తదితరులు ఉన్నారు.

వడ్డీ వ్యాపారంలో వివాదం.. కేసుల నమోదు

ఉలవపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారంలో ఇద్దరు మహిళల మధ్య తలెత్తిన వివాదంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో కేసులు నమోదైనట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నేటికోటకు చెందిన నంబూరి అనురాధ అదే గ్రామానికి చెందిన గొత్తుల నాగమణి వద్ద నుంచి మూడేళ్ల క్రితం రూ.2 లక్షలు అప్పుగా తీసుకుంది. ఇటీవల కాలంలో అనురాధ కొంత సొమ్ము చెల్లించగా, మిగిలిన డబ్బు ఈనెల 3వ తేదీన వడ్డీ తగ్గించి చెల్లించబోయింది. దీంతో వడ్డీ తగ్గించేది లేదని, చెల్లించాలని నాగమణి పట్టుపట్టడంతో ఇద్దరి మధ్య వాదనలు జరిగాయి. ఈక్రమంలో తనను కొట్టి మెడలోని 6 సవర్ల బంగారు గొలుసు నాగమణి లాక్కొందని, గాయపడిన అనురాధ ఉలవపాడు సీహెచ్‌సీలో చేరగా వైద్యుల రిపోర్టు మేరకు నాగమణిపై కేసు నమోదు చేశారు. కాగా, తనకు చెల్లించాల్సిన డబ్బులు అడగానికి వెళ్లిన తనను అనురాధ, ఆమె కొడుకు కలిసి కొట్టగా నాగమణి కూడా ఉలవపాడు ఆసుపత్రిలో చేరింది. వైద్యుల సమాచారంతో అనురాధ, ఆమె కొడుకుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'ప్రకాశం'లో టీవీఎస్ బ్రేక్స్ ఇండియా ప్లేస్‌మెంట్ డ్రైవ్

కందుకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న టీవీఎస్ బ్రేక్స్ ఇండియా సంస్థ స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. ఈ డ్రైవ్‌లో ఈఈఈ, ఈసీఈ, మెకానికల్ విభాగాలకు చెందిన ఫైనలియర్ విద్యార్థులు పాల్గొనగా రాతపరీక్ష, సాంకేతిక ఇంటర్వ్యూ, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూల అనంతరం 32మందిని ఉద్యోగాలకు ఎంపికచేసుకున్నట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తు పరిశ్రమల దశను నిర్ణయించేది కోర్ శాఖలేనని, అందుకే తమ విద్యార్థులను కోర్‌లో నిపుణులుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టరు విక్రం, సాహిత్య, అకడమిక్ ఇన్‌చార్జి మీరావలి, సుమలత, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో టీవీఎస్ బ్రేక్స్ ఇండియా సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధులు

ఘనంగా గురుపూజోత్సవం

కందుకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఏఐ బ్రాంచ్ విద్యార్థులు కేకు కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులను సత్కరించారు. వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు బొగ్గవరపు వెంకటరామయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, చెక్కా కేశవ, కాకుమాను ప్రవీణ్‌కుమార్, ఇన్నమూరి శ్రీనివాసులు, గుర్రం చిన్న అల్లూరయ్య, కంకణాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కందుకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1975 సంవత్సరం పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం కోలాహలంగా జరిగింది. ఈ ఆత్మీయ సమ్మేళనంలో తమకు పదవ తరగతిలో విద్యాబోధన చేసిన గురువులందరినీ స్మరించుకున్నారు. ప్రస్తుతం వారిలో ఒక్కరు మినహా మరెవరూ లేనందున వారికి నివాళులర్పించారు. ప్రస్తుతం జీవించిఉన్న నాటి గురువు బొగ్గవరపు వెంకటరామయ్య నివాసానికి పూర్వవిద్యార్థులంతా వెళ్లి ఆయనను ఘనంగా సత్కరించారు.

సృష్టిలో గురువు స్థానం అత్యున్నతం

● ఉపాధ్యాయ దినోత్సవంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి



కొండాపురం : సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

కావలి, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): తల్లి జన్మనిస్తే.. తండ్రి నడకనేర్పితే.. జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేది మాత్రం గురువేనని, సృష్టిలో గురువు స్థానం అత్యున్నతమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ సభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముందుగా సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించించారు. సాధారణ ఉపాధ్యాయుడి నుండి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. తాను కూడా ఉపాధ్యాయవృత్తి నుంచే ఎదిగానని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు.

జడ్పీ హైస్కూలుకు పూర్వవైభవం తీసుకొస్తాం...

సుమారు వంద సంవత్సరాల చరిత్ర కలిగిన కావలి జడ్పీ హైస్కూలుకు పూర్వవైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. దానిని మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేయటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. బాలురు, బాలికల ఉన్నత పాఠశాల్లో చెరో 1200 మంది విద్యార్థులు చదువుకునేలా ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపీడీవో శ్రీదేవి, మండల విద్యాశాఖాధికారులు గోవిందయ్య, వెంకటసుబ్బయ్యలతో కలిసి ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ నేతలు గుత్తికొండ కిశోర్‌బాబు, జ్యోతి బాబూరావు, మధుబాబు నాయుడు, రాంప్రసాద్, ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.



ఉలవపాడు : అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం

ఘన సన్మానం

కొండాపురం, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయిన ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖాధికారులు రవికుమార్, ఆనందరావులు మాట్లాడుతూ విద్యార్థులను జ్ఞాన జ్యోతులతో వెలుగును చూపే బాధ్యత గురువులదేనన్నారు. బిడ్డలను ప్రపంచం గుర్తించేవిధంగా తీర్చిదిద్దేది గురువులేనన్నారు. ఉపాధ్యాయ వృత్తికే గుర్తింపుతెచ్చి భారతరత్న అవార్డు అందుకొని రాష్ట్రపతి పదవికి ఎంపికయిన డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. మండలపరిధిలో ప్రాథమిక పాఠశాలస్థాయిలో 10 మంది, జడ్పీ ఉన్నత పాఠశాలల నుండి 5 మంది, సాయిపేట మెయిన్ ప్రాథమిక ఆదర్శ పాఠశాల ప్రదానోపాధ్యాయుడు జగన్మోహన్‌రావులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవ్వగా ఘనంగా సన్మానించారు. అలాగే ఉత్తమ సేవలు అందించిన సీఆర్ ఎమ్‌టిలను ఈసందర్భంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మండలపరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు

కలిగిరి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలో శుక్రవారం డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురుపూజోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ సురేష్ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా విద్యాభివృద్ధికి కృషి చేస్తే గుర్తింపు వస్తుందన్నా రు. ఈ సందర్భంగా 17 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ, ఉపాధ్యాయ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఉలవపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉలవపాడులోని అంగన్‌వాడీ సెంటర్-1లో సూపర్‌వైజర్ రమాదేవి ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త హేమలత, ఆయా వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయుడిగా హనుమంతరావు

అల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా కె. హనుమంతరావు ఎంపికయ్యారు. ఆయనతోపాటు ఏ ఝాన్సీ, బీ చంద్రశేఖర్, ఎస్‌డీ. పర్వీన్, వై రమేష్, పీ సంపూర్ణమ్మ, పీ నాగరాజు, కే సాధనలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (సుబ్బయ్య బడి)లో నిర్వ హించే కార్యక్రమంలో వీరిని అవార్డులతో సత్కరించనున్నారు.

మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సునీత



వలేటివారిపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండలం ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మద్దినేని సునీత ఎంపికైనట్లు ఎంఈఓ మల్లికార్జునరావు తెలిపారు. ఆమె ప్రస్తుతం శింగమనేనిపల్లె హెచ్‌పి స్కూల్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తునట్లు తెలిపారు. కాగా, మండల ఉత్తమ ఉపాధ్యా యురాలిగా ఎంపికైన సునీతకు పలువురు టీచర్లు అభినందనలు తెలియజేశారు.





సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకుంటున్న ప్రొఫెసర్లు ఎం.అరుణ (హోంసైన్స్)



పెంచలనేని జ్యోత్స్న (బయో టెక్నాలజీ)



వెంకటకృష్ణ (కంప్యూటర్‌సైన్స్)



వైఎస్ శారద (ఇంగ్లీషు)



డి.సుబ్బారావు (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్)



అక్కల స్వతంత్ర (మెకానికల్ ఇంజినీరింగ్)



టి.రమాశ్రీ (ఈసీఈ)



ఎం.బాలాజీ (బయోకెమిస్ట్రీ)



టి.విజయ (బోటనీ)



టి.చంద్రశేఖరయ్య (పాపులేషన్ స్టడీస్)



రమ్యాకుబేర్ (ఫార్మసీ)



సి. భువనేశ్వరిదేవి (పద్మావతి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్)



ఈశ్వరరావు (లైవ్‌స్టాక్ ప్రొడక్ట్స్ టెక్నాలజీ)



లెక్చరర్లు పి.కుమారి నీరజ (శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల)



గంగారామ్ (శ్రీకాళహస్తి ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల)



చీర్ల వెంకటరమణ (చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల)



టీచర్లు సుబ్రహ్మణ్యశర్మ (శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు)



కె.బాలసుబ్రహ్మణ్యం (తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెం)



శెట్టి రామకృష్ణ (శ్రీకాళహస్తి మండలం ఎగువవీధి పాఠశాల పీడీ)



ఎస్వీ కుమార్ (పుత్తూరు మండలం పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్)

గురుపూజోత్సవంలో కలెక్టర్ పిలుపు

68 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

విద్యార్థులపట్ల వ్యక్తిగతంగా శ్రద్ధ చూపాలి

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతల వివరాలు.. 6లో





పురస్కార గ్రహీతలతో కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు



డీఈవోను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు, కలెక్టర్



తిరుపతి(విద్య), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'వృత్తిపరంగానే ఆలోచించకుండా విద్యార్థులపట్ల వ్యక్తిగతంగానూ ఉపాధ్యాయులు శ్రద్ధ చూపండి. అప్పుడే విద్యార్థులు వారి ఇబ్బందులన్నీ మీకు చెబుతారు. వాటి పరిష్కారానికి మీరు తోడ్పడినప్పుడు విద్యార్థులకు చదువుపట్ల ఆసక్తి పెరుగుతుంది. వారి ప్రవర్తన, ఫలితాల్లోనూ పురోగతి కనబడుతుంది' అని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో జరిగిన గురుపూజోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు విన్నూతంగా కొత్త బోధనా పద్ధతులు అవలంబించాలన్నారు. ప్రతి తరగతికి ఒక టీచరు ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పాఠశాలలను వర్గీకరించిందని వివరించారు. ఈ వర్గీకరణ ఫలితాలు ఇప్పుడు కనబడవని, ఐదేళ్లలో ఆవిష్కృతమవుతాయని తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. అందుకనే ఏడాదిలోనే మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుందన్నారు. సమాజాన్ని జాగృతి చేయడంలో ఉపాధ్యాయులదే కీలక భూమిక అని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. ప్రభుత్వ విద్యలో లోటుపాట్లు లేకుండా ఉపాధ్యాయ నియామకాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. విద్యారంగంలో అనేక సంస్కరణలను మంత్రి నారా లోకేశ్ తీసుకొచ్చారని శాప్ చైర్మన్ రవినాయుడు వివరించారు. గురువులు చూపిన బాటలో నడిచేవారందరూ ఆయా రంగాల్లో అభివృద్ధి చెందుతారని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ తెలిపారు. సమాజంలో మనలను మంచి పౌరులుగా తీర్చిదిద్దేవారు గురువులేనంటూ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, విద్యాశాఖలో విప్లవాత్మక మార్పుల గురించి జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా జిల్లాలోని 62 మంది ఉపాధ్యాయులు, ఆరుగురు ఎంఈవోలకు కలిపి మొత్తం 68 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు, సమగ్ర శిక్ష సీఎంవో సురేష్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్సీ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు. గురుపూజోత్సవాన్ని డీఈవో కుమార్, ఇతర అధికారులు శ్రమకోర్చి విజయవంతంగా నిర్వహించారని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా డీఈవోను సన్మానించారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కార్యక్రమం చేపట్టారు.



సీఎం ప్రత్యేక చొరవతో 'శెట్టిపల్లె' భూసమస్యకు పరిష్కారం

- త్వరలో ఏర్పాటుకానున్న మోడల్ టౌన్‌షిప్
- వచ్చే నెలలో లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు
- మీడియా సమావేశంలో కలెక్టర్ వెల్లడి

మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, కమిషనరు మౌర్య



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవతో శెట్టిపల్లె భూసమస్య పరిష్కారమైందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంత్రివర్గ సమావేశంలో శెట్టిపల్లె భూసమస్యకు క్లియరెన్స్ ఇవ్వడంతో శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. హౌస్ హోల్డర్లకు 50:50 నిష్పత్తిలో, వ్యవసాయభూమి కలిగిన వారికి 30:70 నిష్పత్తిలో ప్లాట్లు కేటాయిస్తామన్నారు. తుడాకు 65, ప్రభుత్వానికి 90 ఎకరాలు వచ్చేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. తుడా రూ.200కోట్లతో ఇక్కడ మెగా టౌన్ షిప్‌తరహాలో మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వానికి కేటాయించిన 90 ఎకరాలలో వరల్డ్ క్లాస్ ప్రాజెక్టులు, టూరిజం ప్రాజెక్టులు తీసుకువచ్చి భూముల విలువ పెరిగేలా చర్యలు చేపడతామన్నారు. 'మొదట ప్రతి ఒక్కరికి సెంటున్నర ఇవ్వాలనుకున్నాం. అయితే ప్రజాప్రతినిధుల కోరిక మేరకు సీఎం చంద్రబాబు రెండు సెంట్లు ఇవ్వాలని ఆదేశించారు. 1,300మందికి పైగా రెండు సెంట్ల స్థలం, మిగిలిన వారికి రెండు సెంట్లకంటే ఎక్కువ భూమి ఇచ్చే అవకాశం ఉంది. దాదాపు 2,500 కుటుంబాలు దీని ద్వారా లబ్ధి పొందుతాయి. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రూ.2 వేల కోట్ల ప్రాపర్టీకి రిజిస్ట్రేషన్ చర్యలు చేపట్టనున్నాం. తుడాకు కేటాయించిన 65 ఎకరాల్లో నెల రోజుల్లోపలే అంతర్గత రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక వసతుల పనులు ప్రారంభిస్తారు. అక్టోబరు 15 నాటికి లాటరీ పూర్తి చేసుకుని తరువాత ప్లాట్లు కేటాయిస్తారు. మరో 45రోజుల్లో జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో శెట్టిపల్లివాసులకుపట్టాలు పంపిణీ చేస్తాం' అని కలెక్టర్ వివరించారు. ఈ ప్రాంతాన్ని ఒక మోడల్ టౌన్‌షిప్‌గా ఏర్పాటు చేయడమే సీఎం ఆలోచన అన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ శెట్టిపల్లి వాసులకు ఇచ్చిన హామీని చంద్రబాబు, పవన్ నెరవేర్చారన్నారు. గత ప్రభుత్వంలో తుడా నుంచి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి శెట్టిపల్లిని మార్చి భూములుకొట్టేయాలని ఆ పార్టీ నాయకులు ప్రయత్నించారని ధ్వజమెత్తారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆ ప్రాంతంలోని 227 ఎకరాల్లో మౌలిక వసతులు కల్పించి మెగాటౌన్‌షిప్‌ను నిర్మిస్తామన్నారు. తుడాకు కేటాయించే 65 ఎకరాల ద్వారా సమకూరే ఆదాయంలో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన 227ఎకరాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు.నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య మాట్లాడుతూ శెట్టిపల్లి వాసులకు అన్ని వసతులతోకూడిన లేఅవుట్లు ఏర్పాటు చేస్తామన్నారు. శెట్టిపల్లి భూబాధితులు రాష్ట్ర ప్రభుత్వానికి,ప్రజాప్రతినిధులు, కలెక్టర్ వెంకటేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చదువు చెప్పిన చోటే వద్దంటోంది

వారు అక్కడే చదువుకున్నారు. అక్కడే పట్టభద్రులయ్యారు. కొందరు అక్కడే అడహక్ కింద ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే రెగ్యులర్ ఉద్యోగుల నోటిఫికేషన్‌కు మాత్రం వారు అర్హులు కాదని పక్కన పెట్టేశారు. వారు అర్హులేనని చట్టం చెబుతున్నా అవేమీపట్టకుండా మొండిగా ముందుకెళ్తున్న శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యాజమాన్యంపై పలువురు వైద్య అభ్యర్థులు మండిపడుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- పట్టా ఇచ్చిన సంస్థే పక్కన పెట్టేసింది
- నిబంధనలకు విరుద్ధంగా స్విమ్స్ నోటిఫికేషన్
- మెడికల్ అభ్యర్థులకు టీటీడీ అన్యాయం



మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీ కొరతను దృష్టిలో పెట్టుకుని స్విమ్స్ వర్సిటీలో 2003 నుంచి మెడికల్ ఎమ్మెస్సీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. బీఎస్సీ (లైఫ్‌సైన్సెస్) చదివిన విద్యార్థులకు స్విమ్స్ ఎంట్రన్స్ ఎగ్జామ్ నిర్వహించి, అందులో వచ్చిన ర్యాంకుల ఆధారంగా అనాటమీ, ఫిజియాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ కోర్సులలో సీట్లు కేటాయించింది. ఈ పీజీ కోర్సులకు మూడేళ్ల కాలవ్యవధిని నిర్ణయించింది. 2003లో తొలిబ్యాచ్ మొదలవ్వగా 2019 ఎంఎస్సీ మెడికల్ పీజీ కోర్సులను నిలిపివేసింది. ఈక్రమంలో 150 మంది ఎమ్మెస్సీ మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉత్తీర్ణులై స్విమ్స్‌తో పాటు వివిధ మెడికల్ కాలేజీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఆయా విభాగాల్లోని పలువురు స్విమ్స్‌లోనే పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పట్టాపొందారు. మరికొందరు పీహెచ్‌డీ చేస్తున్నారు. పీహెచ్‌డీ చేసినవారు ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ స్థాయిలో కూడా ప్రస్తుతం పనిచేస్తున్నారు.

ఇప్పుడెందుకు వద్దంటున్నారు

టీటీడీ నిర్వహణలోని స్విమ్స్‌లో 9 ప్రొఫెసర్లు, 20 అసోసియేట్ ప్రొఫెసర్లు, 67 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి గతనెల 14న నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నోటిఫికేషన్‌లో బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్‌కు ఎండీ, ఎంస్ లేదా డీఎస్సీ అర్హతలు కావాలని నిర్దేశించింది. దీంతో స్విమ్స్‌లోనే చదివిన ఎంఎస్సీ/పీహెచ్‌డీ అభ్యర్థుల పట్ల అన్యాయంగా వ్యవహరించింది. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం 1956 ప్రకారం ఎమ్మెస్సీ/పీహెచ్‌డీను మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా తీసుకోవచ్చు. అలాకాకుండా ఎండీ, ఎంఎస్/డీఎస్సీ ఉండాలని నిబంధన పెట్టడం సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. అదేమని అడిగితే ఐఎన్ఐ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్) మేరకు రిక్రూట్ చేసుకుంటామని అభ్యర్థులకు స్విమ్స్ చెబుతున్నట్టు తెలుస్తోంది. తమకు జరుగుతున్న అన్యాయంపై కోర్టును ఆశ్రయించాలనుకున్న అభ్యర్థులకు వీలు లేకుండా ముందుగానే స్విమ్స్ కేవిట్ ఫైల్ చేసింది. ఐఎన్ఐ నిబంధనలు కేవలం జాతీయ వైద్యసంస్థలైన ఎయిమ్స్, జిప్‌మర్, పీజీఐఎంఆర్ సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది. స్విమ్స్ ఇప్పటికీ స్టేట్ యాక్ట్ (రాష్ట్ర చట్టం)తో నడిచే విశ్వవిద్యాలయం మాత్రమే. నాన్‌క్లినికల్ మెడికల్ కోర్సులు (ఎమ్మెస్సీ/పీహెచ్‌డీ) చేసిన అభ్యర్థులు అర్హులేనని స్టేట్ యాక్ట్‌తో నడిచే వర్సిటీ నిబంధనలు చెబుతున్నాయి. ఆ మేరకే ఎస్వీమెడికల్ కాలేజ్, శ్రీబాలాజీ మెడికల్ కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. అయితే స్విమ్స్‌లో చదివిన విద్యార్థులను మాకొద్దని పక్కన పెట్టడం ఆశ్చర్యంగా ఉంది. తల్లి లాంటి స్విమ్స్ వర్సిటీనే తమను గుర్తించకపోతే ఇతర వైద్య సంస్థలు ఏవిధంగా ఆదరిస్తాయని వైద్య అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్విమ్స్ యాజమాన్యం పునరాలోచించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.


ఆరు బార్లకు మళ్లీ నోటిఫికేషన్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు దరఖాస్తులు రాని ఆరు బార్లకు మళ్లీ నోటిఫికేషన్ జారీ చేస్తూ జిల్లా ఎక్సైజ్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో ఒకటి, గూడూరు మున్సిపాలిటీలో రెండు, సూళ్లూరుపేట మున్సిపాలిటీలో రెండు, వెంకటగిరి మున్సిపాలిటీలో ఒక బారుకు సంబంధించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానం ద్వారా ఈ నెల 14న సాయంత్రం 6 గంటల లోపు దరఖాస్తులు సమర్పించవచ్చు. ఒక వ్యక్తి ఎన్ని బార్లకైనా.. ఎన్ని దరఖాస్తులైనా అందజేయొచ్చు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

- కాణిపాకంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుని ఆలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ధ్వజావరోహణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయంలోని ధ్వజస్తంభంపై వున్న మూషిక ధ్వజ పటాన్ని అర్చకులు, వేదపండితులు మేళ,తాళాలు,వేద మంత్రోచ్చారణ నడుమ కిందకు దించడంతో ధ్వజావరోహణం పూర్తయింది. అంతకుముందు పుష్కరిణి వద్ద త్రిశూల స్నానాన్ని నిర్వహించారు. కాగా బ్రహ్మోత్సవాల విధుల్లో అలసిసొలసిన ఆలయ అధికారులు, సిబ్బందికి ఆటవిడుపుగా వసంతోత్సవాన్ని నిర్వహించారు.బ్రహ్మోత్సవాల ప్రారంభ సందర్భంగా ఈవో కిషోర్‌కు,ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్‌కు కట్టిన కంకణాలను శుక్రవారం అర్చకులు తొలగించారు.అనంతరం ఈవోను ఆలయ మర్యాదలతో కార్యాలయం వద్ద దిగబెట్టారు. ఇక, శనివారం నుంచి 16వ తేది వరకు ప్రత్యేక ఉత్సవాలను నిర్వహించనున్నారు.



10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందించారు. ఈ యోగా కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప కేంద్రాలలో తెలుగులో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహా ముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందారు. దీనికి సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్రమానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 04041896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

శ్రీవారి సేవలో మరింత నాణ్యత: టీటీడీ ఈవో



తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): ఇటీవల చేపట్టిన సంస్కరణల వల్ల శ్రీవారిసేవలో నాణ్యత పెరుగుతుందని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. శ్రీవారిసేవకులకు గ్రూప్ సూపర్‌వైజర్లు, ట్రైనర్లకు శిక్షణ మాడ్యూల్‌పై శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో సమీక్ష నిర్వహించారు. శిక్షణ మొదటి విడత కార్యక్రమం ఈనెల 24 నుంచి ప్రారంభమై మూడురోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఏపీ ప్లానింగ్ విభాగం ఈడీ వెంకటేశ్వరావు, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, వర్చువల్‌గా ఐఐఎం అహ్మదాబాద్‌కు చెందిన ప్రొఫెసర్లు విశ్వనాథ్, రామమోహన్, అదనపుఈవో వెంకయ్య చౌదరి ఈసమీక్షలో పాల్గొన్నారు.

తిరుమలలో నేడు అనంతపద్మనాభ వ్రతం

తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం అనంతపద్మనాభ వ్రతం జరుగనుంది. ఉదయం 6 గంటలకు శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా వరాహస్వామి ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి పూజలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్వామి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించి తిరిగి ఆలయానికి తీసుకువస్తారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరిరోజున, వైకుంఠ ద్వాదశి, రథసప్తమి రోజుల్లో కూడా చక్రస్నానం నిర్వహిస్తారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,834

తలనీలాలు సమర్పించినవారు: 24,628

శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ



అమ్మవారికి హారతులు ఇస్తున్న అర్చకులు

తిరుచానూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు పవిత్ర ప్రతిష్ఠతో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీపద్మావతి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవలో అమ్మవారిని మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు ఉదయం ఉత్సవర్లను ఆలయం నుంచి యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం ద్వార తోరణ, ధ్వజ కుంభ ఆవాహనం, చక్రాది మండల పూజ, చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించి, విశేషంగా అలంకరించారు. పవిత్రోత్సవాలను పురస్కరించకుని ఆలయంలో పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, మణికంఠ స్వామి, బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. పవిత్రోత్సవాల్లో రెండో రోజైన శనివారం శనివారం పవిత్ర సమర్పణ ఉంటుంది.



యాగశాలలో ప్రత్యేక పూజలు

శ్రీవారి సేవలో ప్రముఖులు



బన్వరిలాల్ వర్మ

తిరుమల,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి బన్వరిలాల్ వర్మ, తెలంగాణ ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు ఉన్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో తెలంగాణ హైకోర్టు సీజే



ఆలయం వద్ద తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్

తిరుచానూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, వేదపండితులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, శాంతారాం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల్లో ఆనందం వెల్లువ

- ఎద క్రమబద్ధీకరణ పథకంతో సత్ఫలితాలు
- స్వర్ణ నారావారిపల్లెలో తొలిదశలోనే 61 శాతం విజయవంతం



ఎద క్రమబద్ధీకరణ, చూలు కట్టించేందుకు రైతులు తీసుకువచ్చిన పశువులు

చంద్రగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత గ్రామం నారావారిపల్లె క్లస్టర్ పరిధిలో పాడిరైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ క్లస్టర్ పరిధిలో ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం పంచాయతీలున్నాయి. సీఎం సంకల్పం మేరకు స్వర్ణ నారావారిపల్లె పైలెట్ ప్రాజెక్టులో క్లస్టర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదాయాభివృద్ధితో స్వావలంబన సాధించేలా పథకాలు రూపొందించారు. ఇప్పటికే నారావారిపల్లెలో అత్యధిక సౌరవిద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు. ఈక్రమంలోనే ఇటీవల జిల్లా కలెక్టర్ స్కోచ్ అవార్డు కు ఎంపికయ్యారు. అదేవిధంగా పశు సంవరక్షశాఖ ఆధ్వర్యంలోని ఎద క్రమబద్ధీకరణ పథకం క్లస్టర్ పరిధిలో పాడిరైతులకు వరంగా మారింది. గతంలో చూలు కట్టని పశువుల పోషణ రైతులకు ఆర్థిక భారమయ్యేది. పశువులను మేపడం కష్టమై ఒక్కోసారి కోతకు కూడా విక్రయించేవారు. పశువు ఏటా ఈనితేనే లాభమొస్తుంది. ఈనేపథ్యంలో ఈ ఏడాది మార్చి చివర్లో ఎద క్రమబద్ధీకరణ పథకం కింద 171 మంది రైతులకు చెందిన 218 పశువులను ఎదకు రానివిగా గుర్తించారు. 50 శాతం రాయితీతో రూ.400 కట్టించుకుని రూ.1100 విలువ గలదాణా, ఖనిజలవణ మిశ్రమం, లవణ మాత్రలు, హార్మోను ఇంజక్షన్లు తదితర మందులను రైతులకు అందించారు. ఇవి చూలు కట్టడానికి దోహదపడుతున్నాయి. నిత్యం సుమారు 25 మంది సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈనెల మొదటి వారం పరీక్షించగా 134 పశువులు ఎదకు వచ్చినట్లు గుర్తించామని పశువైద్యాధికారి తెలిపారు. మొదటి విడతలోనే 61 శాతం మేర సానుకూల ఫలితాలను రావడంతో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాల ఉత్పత్తి పెంపు లక్ష్యం



క్లస్టర్ పరిధిలోని పశువులలో పాల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. మొదటి విడతలోనే 61 శాతం ఫలితాలను రాబట్టాం. నాలుగు విడతల్లో వెయ్యి పశువులకు చూలు కట్టించాలనేది ఉద్దేశం. కొత్త పథకం కింద అదనంగా 4200 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతుంది. సంవత్సరానికి రూ.73 లక్షల మేర అదనపు ఆదాయం చేకూరుతుంది.

-డాక్టర్ వంశీ, పశు వైద్యాధికారి, నారావారిపల్లె

గతంలో ఎన్నో ఇబ్బందులు



ఎద క్రమబద్ధీకరణ, చూలు కట్టించడం పాడి రైతులకు వరం. గతంలో కృత్రిమ గర్భధారణకు చాలా ఇబ్బందులు పడ్డాం. ఎదకు రాని పశువులను మేపడం కష్టంగా ఉండేది. ఆర్థికంగా దెబ్బతిని పశువులను కోతకు ఇచ్చేవాళం. సీఎం చంద్రబాబు చొరవ వల్ల కొత్త పథకంతో ఆర్థికంగా నిలబడతామని నమ్మకం కలిగింది

- చంద్రబాబునాయుడు, భీమవరం

రెండు విధాలా ఆదాయం



ఎదక్రమబద్ధీకరణ పథకం ద్వారా చూలు కట్టిన పశువును అమ్ముకోవాలన్నా రెండింతలు హెచ్చు ధర పలుకుతుంది. చూలు కట్టిన పశువు రైతు దగ్గరే ఉంటే పాల ఉత్పత్తి రెండింతలు పెరుగుతుంది. ఇలా రెండు రకాలూ ఆర్థికంగా ఆదాయం ఉంటుంది. ఈ పథకంతో పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

- సుబ్రమణ్యంయాదవ్, ఎ.రంగంపేట

8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఒక కారు సీజ్



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని చూపుతున్న అటవీశాఖ అధికారులు

మంగళం, సెప్టెంబరు5(ఆంధ్ర జ్యోతి): రేణిగుంట-మామండూరు మార్గంలో శుక్రవారం తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించి 8ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ కారును సీజ్ చేశారు. తిరుపతి రేంజర్ సుదర్శన్‌రెడ్డికి అందిన సమాచారం మేరకు గురువారం రాత్రి నుంచి ఆ మార్గంలో అధికారులు పెట్రోలింగ్ నిర్వహించారు. పులిచెర్ల వద్ద వేగంగా వస్తున్న ఏపీ 39 సి7116 నెంబరు కారును ఆపే ప్రయత్నం చేయగా వారు ఆపలేదు. దీంతో వాహనాన్ని వెంబడించారు. చైతన్యపురం చెక్‌పోస్టు సమీపంలో కారును ఆపి డ్రైవర్ పారిపోయాడు. అధికారులు కారులో పరిశీలించగా 8ఎర్రచందనం దుంగలు ఉన్నాయి.కారు సహా దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ దుంగలు, కారు విలువ రూ.5లక్షలుంటుందని రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఆర్ఎస్ చైతన్య, ఎఫ్‌బీవో చెంగ్రాయ నాయుడు, ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రి, వెంకట్, రవి, ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని మోసం

- రూ.70వేలు తీసుకున్న దళారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు



కార్తీక్

తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని నమ్మించి మోసగించిన ఓ దళారీని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లాలోని వెంగలాయపాలెంకు చెందిన హరి నాగసాయి కార్తీక్ కొన్నేళ్లుగా భక్తులను మోసగిస్తూ అందినవరకు దోచుకుంటున్నాడు. ఇటీవల ఫేస్‌బుక్‌లో 'శ్రీప్రభాకర చార్యులు' అనే నకిలీ ఖాతాను తెరిచాడు. తాను తిరుమలలో సహాయ అర్చకుడినని, బ్రేక్ దర్శనాలు, ఆర్జితసేవ టికెట్లు ఇప్పిస్తానని భక్తులను నమ్మించి మోసం చేయడం మొదలుపెట్టాడు. ఆదిత్య, హరికృష్ణ, నాగార్జున అనే మరో ముగ్గురి సహాయంతో బ్యాంకు ఖాతాలు కూడా తెరిచాడు. ఈ ముఠా తిరుపతికి చెందిన విజయ్ అనే భక్తుడికి నాలుగు సుప్రభాతసేవ టికెట్లు ఇప్పిస్తామని చెప్పి రూ.70,070 తీసుకున్నారు. ఆ తర్వాత ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్‌బాబు, చలపతి ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తిరుమలలోని కర్ణాటక సత్రాల వద్ద కార్తీక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్దనున్న రూ.1.03 లక్షల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీన పరుచుకున్నారు. ఇప్పటికే కార్తీక్‌పై తిరుమల వన్‌టౌన్, టూటౌన్‌లో రెండు కేసులు, తిరుపతి ఈస్ట్‌లో మరో కేసు నమోదై ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అలాగే 16 మంది ఎన్ఆర్ఐ భక్తులకు అభిషేకం టికెట్లు ఇప్పిస్తానని నమ్మించి రూ.36 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనలో జైలుకు వెళ్లి.. బెయిల్‌పై వచ్చిన కార్తీక్.. మళ్లీ భక్తులను మోసగించడం మొదలుపెట్టాడని పోలీసులు తెలిపారు.





ఈశ్వర్ ఇంట్లో పగలగొట్టిన బీరువా - గీత ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

రెడ్డివారిపల్లెలో చోరీ

రూ.40వేలు నగదు, 20 గ్రాముల బంగారం, 2.5 కేజీల వెండి అపహరణ

చంద్రగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ రెడ్డివారిపల్లెలో చోరీ జరిగింది. నగలు, నగదు అపహరణకు గురైంది. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈశ్వర్ తన తండ్రికి అనారోగ్యం కారణంగా ఇంటికి తాళాలు వేసుకొని గురువారం తిరుపతికి వెళ్లారు. గ్రామానికి చెందిన గీతా కుటుంబ సభ్యులు వేరే ఊరికి వెళ్లడంతో ఆమె అదే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండిళ్లలో తాళాలు పగలగొట్టి ఈశ్వర్ ఇంట్లో 40 వేలు నగదు, గీతా ఇంట్లో 20 గ్రాముల బంగారం, 2.5 కేజీల వెండి చోరీ చేశారు. శుక్రవారం ఉదయం ఇంటికి చేరుకున్న ఇరు కుటుంబాల వారు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో వచ్చి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నాదస్వర డోలు విద్యార్థులకు డిపాజిట్ చెక్కుల పంపిణీ



అందుకున్న డిపాజిట్ చెక్కుతో నాదస్వర డోలు విద్యార్థులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వెంకటేశ్వర సంగీత, నృత్య కళాశాలలో నాదస్వర డోలు విద్యార్థులకు డిపాజిట్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. 2017-2023, 2018-2024 విద్యాసంవత్సరంలో ఆరేళ్లపాటు సర్టిఫికెట్ డిప్లొమా కోర్సులో ఉత్తీర్ణులైన డోలు విద్యార్థులకు రూ.46.20లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా డోలు విద్యార్థులు వెంకటేశ్వరస్వామికి తమ డోలు విద్య ద్వారా నాదాంజలి సమర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఉమాముద్దబాల, నాదస్వర పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మి సువర్ణ, విద్యాశాఖ డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ శివకుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

జిల్లాలో విభాగాల వారీగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను 68 అందుకున్నారు. వీరిలో ఉపాధ్యాయులు, ఎంఈవోలు ఉన్నారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

హెచ్‌ఎం కేటగిరీ : జి.రామచంద్రయ్య, జడ్పీహెచ్ఎస్, పంగూరు, ఏర్పేడు మండలం.. పి.చిన్నబాబు, జడ్పీహెచ్ఎస్, ఇరుగులం, సత్యవేడు మండలం.. ఎం.కృష్ణవేణి, పీఎస్‌హెచ్‌ఎం, ఎంసీపీఎస్, టీపీ ఏరియా, తిరుపతి.. వి.హరినాథ్, పీఎస్‌హెచ్‌ఎం, ఎంపీఎల్ ఎంపీఎస్, కైలాసగిరి కాలనీ, శ్రీకాళహస్తి.

స్కూల్ అసిస్టెంట్: జి.తేజోవతి, ఇంగ్లీష్, జడ్పీహెచ్ఎస్, తిరుచానూరు, తిరుపతి రూరల్. డి.రఘునాథ్, తెలుగు, జడ్పీహెచ్ఎస్, దామలచెరువు, పాకాల. వి.వెంకటరమణ, ఇంగ్లీష్, ఎంపీపీఎస్, టీపీ కోట, నాగలాపురం. ఎ.సుజాత, సోషల్, జడ్పీహెచ్ఎస్, చెందోడు, కోట. డి.శ్రీనివాసులు, పీఈటీ, జడ్పీహెచ్ఎస్, కరకంబాడి, రేణిగుంట. ఎం.జయంతి, ఫిజికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, చిట్టేడు, కోట. ఎం.సుబ్బరామయ్య, ఫిజికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, వరదాయపాళెం. కె.సువర్ధన, ఫిజికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, చెందోడు, కోట. పి.కిషోర్‌కుమార్, పీఈటీ, జడ్పీహెచ్ఎస్, ముచివోలు, శ్రీకాళహస్తి. సి.వాసు, ఇంగ్లీష్, జడ్పీహెచ్ఎస్, తిరుచానూరు, తిరుపతి రూరల్. కె.గోపి, సోషల్, ఎంపీఎస్, వడిమిట్ట, ఏర్పేడు. జె.చంద్రశేఖర్, బయాలజీ, జడ్పీహెచ్ఎస్, రంగన్నగిరిగడ్డ, చిన్నగొట్టిగల్లు. యు. పురుషోత్తం, ఫికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, దామలచెరువు, పాకాల. వీవీఎస్ఎస్ రాధామదనం, తెలుగు, పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్, మంగళం ట్రెండ్, తిరుపతి. ఎ.గోపి, సోషల్, జడ్పీహెచ్ఎస్, పాలమంగళం, నారాయణవనం. పి.రుద్రయ్య, ఫిజికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, చిట్టత్తూరు, తొట్టంబేడు. ఎన్వీ లత, తెలుగు, జడ్పీహెచ్ఎస్, సంతవేలూరు, వరదాయపాళెం. సి.దామోదరం, హిందీ, జడ్పీహెచ్ఎస్, రాజానగరం, పిచ్చాటూరు. జి.జగదీష్, ఇంగ్లీష్, జడ్పీహెచ్ఎస్, పుడుకుప్పం, సత్యవేడు. కె.మునస్వామి, తెలుగు, జడ్పీహెచ్ఎస్, పల్లమాల, బీఎన్ కండ్రిగ. కె.శంకరయ్య, హిందీ, జడ్పీహెచ్ఎస్, కొక్కుపాడు, కోట. కె.రఘునాథ, సోషల్, ఎంసీహెచ్ఎస్, టీవీ గుంట, తిరుపతి. జి.రాజేశ్వరి, సోషల్, జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పుత్తూరు.

ఎస్జీటీ కేటగిరీ: ఎస్ఎస్ కృష్ణప్రియ, ఎంపీపీఎస్, సి గొల్లపల్లి, తిరుపతి రూరల్. వి.వెంకట నాగులు, ఎంపీఎస్ కోటాల, చంద్రగిరి. కె.రామిరెడ్డి, ఎంపీపీఎస్, పాతపేట, చంద్రగిరి. కె.మమత, ఎపీపీఎస్, పద్మావతిపురం, తిరుపతి రూరల్. కె.సురేష్, ఎపీపీఎస్, వాకాడు. టి.మురుగయ్య, ఎంపీపీఎస్, నాగులచెరువు, చంద్రగిరి. కె.బాలాజీ, ఎంపీపీఎస్, పిచ్చాటూరు. ఎం.శైలజ, ఎంపీపీఎస్, మల్లయ్యపల్లి, చంద్రగిరి. పి.శ్రీనివాసరావు, ఎంపీపీఎస్, ముట్టెంబాక, వాకాడు. పి.పుష్ప, ఎంపీపీఎస్, వడమాలపేట. బి.నాగరాజు, ఎంపీపీఎస్, నెరబైలు, ఎర్రావారిపాళెం. ఎల్.వెంకటశారద, ఎంపీఎస్, పల్లెపాళెం, తడ. డి.పుష్పకిరణ్, ఎంపీపీఎస్, సీహెచ్ నిడిగల్లు ఎస్టీ. శ్రీకాళహస్తి. జి.మురళి, ఎంపీపీఎస్, పాపన్నపల్లె, శ్రీకాళహస్తి. ఎన్.రత్నప్రభ, ఎంపీపీఎస్, కండలవారిపల్లి, డక్కిలి. సి.మానస, ఎంపీపీఎస్, భాగ్యనగరం, తిరుపతి రూరల్. పి.లక్ష్మీదేవి, ఎంపీపీఎస్, పోలిచెట్టిగారిపల్లె, పాకాల. ఎం.వెంకటస్వామి, ఎంపీఎస్ సి. మల్లవరం, తిరుపతి రూరల్. జి.పరంధామయ్య, ఎంపీఎస్ హెచ్‌డబ్ల్యు, కొట్టంబేడు, బాలాయపల్లి. ఆర్.మరియమ్మ, ఎంపీఎస్, ఉత్తమ నెల్లూరు, కోట. ఎం.సుబ్రహ్మణ్యం, ఎంపీపీఎస్, నెల్లటూరు మెయిన్, గూడూరు. బి.వెంకటాద్రి, ఎంపీపీఎస్, రెడ్డివారిపల్లె, ఎర్రావారిపాళెం. కె.ఆదినారాయణ, ఎంపీపీఎస్, ఏర్పేడు. డి.జగదీశ్వరి, ఎంపీఎస్, మనులాలుపేట, వెంకటగిరి. ఎం.తిరుమల కొండయ్య, ఎంపీపీఎస్, కాపులూరు మెయిన్. నాయుడుపేట. ఎస్‌కే బాబూలాల్, ఎంపీపీఎస్, కొత్త కండ్రిగ, తొట్టంబేడు. ఆర్.మంజులా దేవి, ఎంపీపీఎస్, తేలుమిట్ట, వెంకటగిరి. ఎం.ప్రభు, ఎంపీపీఎస్, చిన్నగోర్పాడు. పాకాల. వై.మునికుమార్, ఎంపీపీఎస్, తిరువత్యమ్, నారాయణవనం. కె.వినయ్‌కుమార్, ఎంపీపీఎస్, కొత్తపల్లె, దొరవారిసత్రం. వి.సుధాకర్, ఎంపీపీఎస్, తంగేళ్లపాళెం, తొట్టంబేడు. సి.గురవారెడ్డి, ఎంపీపీఎస్, చిందేపల్లి, ఏర్పేడు.

మండల విద్యాశాఖాధికారులు

జి.ఇందిరాదేవి, రేణిగుంట. కె.భాస్కర్‌బాబు, చంద్రగిరి. బి.తిరుమల రాజు, పుత్తూరు. కె.రవీంద్రనాథ్, బీఎన్ కండ్రిగ. బి.మునిరత్నం, నాయుడుపేట. కె.మల్లిఖార్జునరావు, తడ.

కేజీబీవీ కేటగిరీలో: పి. సతీ సావిత్రి, సీఆర్టీ పీఈటీ.

అక్టోబరు 7న భవ్య గుజరాత్ యాత్ర

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : రేణిగుంట రైల్వేస్టేషన్ నుంచి అక్టోబరు 7వ తేదీన భవ్య గుజరాత్ యాత్రకు ప్రత్యేక రైలు బయలుదేరుతుందని ఏరియా మేనేజర్ కె.వేణుగోపాల్ తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లోని ఐఆర్సీటీసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ యాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ యాత్రలో ద్వారక, నాగేశ్వర్ ఆలయం, సోమనాధ్ ఆలయం, అహ్మదాబాద్, మోధేరా, సూర్యదేవాలయం, సబర్మతి ఆశ్రమం, సబర్మతి నదీ తీరం, యునెస్కో వారసత్వ స్థలం రాణికి వావ్, ప్రపంచ ప్రఖ్యాత స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వంటి పుణ్యక్షేత్రాలు, చారిత్రక క్షేత్రాను దర్శించుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ యాత్రా రైలు రేణిగుంట నుండి ప్రారంభమై గూడూరు, నెల్లూరు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్, నిజాముద్దీన్, హుజూర్ సాహెబ్, నాందేడ్, పూణే మార్గంలో ప్రయాణించి తిరిగి అదే మార్గం ద్వారా రేణిగుంటకు చేరుతుందన్నారు. ప్రయాణికులకు వసతితో పాటు ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, శాకాహార భోజనం, వాటర్ బాటిల్ వంటి సౌకర్యాలతో పాటు ప్రయాణ బీమా కూడా కల్పించినట్లు వివరించారు. టిక్కెట్టు ధరలు స్లీపర్ క్లాస్ రూ.18,400లు, త్రీటైర్ ఏసీ రూ.30,200లు, టూటైర్ ఏసీ రూ.39,900లుగా నిర్ణయించినట్లు తెలిపారు. పది రోజులపాటు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. టిక్కెట్టు బుకింగ్ కోసం కె.పవన్‌కుమార్‌ను 9281495853, యేసయ్యను 8287932313 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌బాబు, వీరన్న, కోదండం, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న రైల్వే అధికారులు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం



బాధ్యతలు స్వీకరిస్తున్న కేవీ నాయుడు

పెళ్లకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అభ్యున్నతి కోసం కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని, అందులో భాగంగానే కొచ్చెర్ల వెంకటరమణయ్య నాయుడుకు చిల్లకూరు పీఏసీఎస్ చైర్మన్ పదవి వరించదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం పెళ్లకూరులోని పీఏసీఎస్ కార్యాలయంలో త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. రావులపాడు గ్రామానికి చెందిన కొచ్చెర్ల వెంకరమణయ్య నాయుడు (కేవీ నాయుడు) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా చిల్లకూరు పీఏసీఎస్ పరిధిలోని రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో రవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీకి, ప్రజాప్రతినిధులకు చెడ్డపేరు తేవొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న పోలయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు

పెళ్లకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని కొందరు టీడీపీ సీనియర్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు పార్టీ పటిష్టతకు, ప్రజాప్రతినిధులకు చెడ్డపేరు తెచ్చేలా ఉందని, ఇది సరైన విధానం కాదని ఏఎంసీ వైస్ చైర్మన్ పునబాక పోలయ్య, దామతోటి సుబ్రహ్మణ్యం హితవు పలికారు. శుక్రవారం కొత్తూరు టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. నిరంతరం ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, వారికి సహకరిస్తున్న అధికారులపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. మండలంలో అభివృద్ధి పనులు జోరుగు జరుగుతున్నాయని, కొంతమంది నాయకులు స్వలాభమే ధ్యేయంగా అభివృద్ధిని అడ్డుకుంటున్నట్లు ఆరోపించారు. నెలవల సుబ్రహ్మణ్యంతో పాటు ఎమ్మెల్యే విజయశ్రీపై కొంతమంది నాయకులు నిందలు మోపడం అభివృద్ధిని అడ్డుకోవడమే అన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీకి సహకరిస్తున్న అధికారులపై ఆరోపణలు చేయడం మంచిదికాదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వేలూరు రమణయ్య, మారాబత్తిన గురవయ్య, గుంటపూడి రమణయ్య. రాపూరు పరుశురామ్, రవి, చంద్ర, కన్నలి విజయభాస్కర్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

తడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంత మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్ అన్నారు. శుక్రవారం తడలో ఆయన మాట్లాడుతూ తమ కుటుంబం మొదటి నుంచి టీడీపీలో ఉందని, దానిని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనను చైర్మన్‌గా నియమించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారుల సమస్యలు తనకు తెలుసన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ మత్స్యకారులకు పలు హామీలు ఇచ్చారని, వాటి అమలుకు కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం మత్స్యకార భరోసా రూ.20వేలు అందించిందని, ఇదే తమ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి చిత్తశుద్ధితో ఉందని చెప్పడానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చాన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు పళణి ఉన్నారు.

షార్‌లో ఉపాధ్యాయ దినోత్సవం



సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పిస్తున్న షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెరియన్ తదితరులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని అంతరిక్ష కేంద్రీయ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన షార్ సోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ముత్తు చెరియన్ మాట్లాడుతూ గురువు లేనిదే ఏమి లేదని, ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే గురువులు నేర్పిన విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. అంతకుముందు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ జి.రమేష్, ఎంఎస్‌పి డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహానికి రోడ్డు నిర్మాణం

నాయుడుపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి రోటరీక్లబ్ అధ్యక్షుడు ఆదవరపు నాగూరయ్య తన సొంత నిధులతో రోడ్డు నిర్మించారు. శుక్రవారం రోటరీక్లబ్ గవర్నర్ రవీంద్ర రోడ్డును పారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శులు చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, నాయకులు జయరాజగోపాల్, రామమోహన్, కృష్ణారావు, సోమశేఖర్, రామచంద్రారెడ్డి, హరిబాబు, శ్రీనివాసులు, సుజిత్, ప్రసాద్, శంకర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఎన్నిక ఏకగ్రీవం

వాకాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాకాడు ఆర్టీసీ డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఎన్నిక ఏకగ్రీవం అయింది. గౌరవ అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున, సహాయ కార్యదర్శి ఎస్ఆర్ చంద్రయ్యల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో అధ్యక్షుడిగా జి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా షేక్ వజీర్‌బాషా, సహాయ కార్యదర్శులుగా డి.బలరామయ్య, ఏవీ.సుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా డి. రవి, ఆర్.శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సౌందర్యమ్మ, మాధురి, స్నేహలత, లక్ష్మి, శశిరేఖ, జీవని, సుప్రియ, రమాదేవి, విష్ణువందన, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

కార్మికుల అభ్యున్నతికి కృషి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తానని భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు నాలి మధుసూదన్ యాదవ్ అన్నారు. శుక్రవారం గుంటూరులోని సంఘ్ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి శామ్యూల్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం మధుసూదన్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు.



శామ్యూల్‌నుంచి నియామక పత్రం అందుకుంటున్న మధుసూదన్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ శీనయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిల్లకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ముత్యాలపాడు గ్రామానికి చెందిన సోమశేఖర్, వెంకటేష్ బైక్‌పై గూడూరు నుంచి గ్రామానికి వెళుతుండగా వరగలి క్రాస్‌రోడ్డు వద్ద ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా వెను తిరగడంతో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న సోమశేఖర్, వెంకటేష్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఈవోగా సునీల బాధ్యతల స్వీకరణ



ఎంఈవోను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎంఈవోగా కేఎంఎస్ సునీల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈవో-1గా ఉన్న శ్రీనివాసులురెడ్డి ఆరోగ్య సమస్యల కారణంగా బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఈ నేపథ్యంలో మన్నారుపోలూరు హైస్కూల్‌లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలిగా ఉన్న విధులు నిర్వహిస్తున్న సునీలను ఎంఈవో(ఎఫ్ఏసీ)గా నియమించారు. ఆమెను ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



గోతులమయంగా ఉన్న కొరిడి - పేర్నాడు రోడ్డు - వర్షానికి బురదమయంగా మారిన వేనాడు రోడ్డు

పులికాట్ పల్లెలకు తారురోడ్లు కలేనా?

అటవీశాఖ అభ్యంతరాలతో అభివృద్ధికి అవరోధాలు ● కూటమి సర్కార్‌పై తీరప్రాంతవాసుల ఆశలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశానికే తలమానికమైన రాకెట్ ప్రయోగ కేంద్రం షార్‌ను ఆనుకునే ఉన్న పులికాట్ పల్లెలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. మూడు దశాబ్దాలుగా కొరిడి - పేర్నాడు తారు రోడ్డు నిర్మాణం కలగానే మిగిలిపోయింది. సూళ్లూరుపేట మండలంలోని కొరిడి - పేర్నాడు రోడ్డు, తడ మండలంలోని వేనాడు రోడ్డు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. కొరిడి - పేర్నాడు మార్గంలో కొరిడి, కడపత్ర, దామరాయి పంచాయతీల పరిధిలో దాదాపు 23 తీరప్రాంత గ్రామాలు ఉన్నాయి. అదే విధంగా తడ మండలం వేనాడు పంచాయతీ పరిధిలో 5 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలు షార్ సమీపంలో పులికాట్ సరస్సు మధ్యలో ఉన్నాయి. ఈ గ్రామాలకు వెళ్లే దారులన్నీ అటవీ ప్రాంతంలో ఉండడంతో తారురోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అభ్యంతం చెబుతుండడంతో తారురోడ్ల నిర్మాణానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఈ రోడ్డు గురించి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అసెంబ్లీ ప్రస్తావించిన నేటికీ కార్యరూపం దాల్చలేదు. కనీసం ఉన్న గ్రావెల్ రోడ్డునైనా మరమ్మతులు చేయండి మహాప్రభో అని గ్రామస్తులు వేడుకొంటున్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అట్టకానితిప్ప బీటీ రోడ్డు నుంచి కొరిడి - పేర్నాడుకు పులికాట్ సరస్సు మధ్యలో గ్రావెల్ రోడ్డును 1990లో కల్పించారు. అప్పట్లోనే బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రయత్నించినా అటవీశాఖ అభ్యంతరాలతో ఫలించలేదు. అనంతరం ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు చేసిన ప్రయత్నాలు నెరవేరలేదు. అదే విధంగా అట్టకానితిప్ప నుంచి కుడివైపు తడ మండలం వేనాడుకు పులికాట్ సరస్సును చీల్చుతూ గ్రావెల్ రోడ్డు ఉంది. వేనాడులో ప్రఖ్యాతి గాంచిన దర్గా ఉండడంతో పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తూ ఉంటారు. తారురోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 2009-2014, 2014-2019 మధ్య కాలంలో ప్రభుత్వాలు తారురోడ్డు నిర్మాణం కోసం ఐదుశాఖల అధికారులతో సర్వే చేయించి నిధులు మంజూరు చేసినప్పటికీ అటవీశాఖ అభ్యంతరాలతో పనులు ప్రారంభం కాలేదు. కొరిడి - పేర్నాడు మార్గంలో పలుసార్లు పులికాట్ సరస్సులో ఆర్టీసీ బస్సు బోల్తాపడిన సంఘనలు ఉన్నాయి. అదే విధంగా వేనాడు మార్గంలో పులికాట్ సరస్సులోకి బస్సు ఒరిగిపోయిన సంఘటనలు ఉన్నాయి. వర్షాకాలం, వరదలు సంభవించినప్పుడు పులికాట్ సరస్సు నీరు రోడ్లపై ప్రవహించి కోతకు గురవుతున్నాయి. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ రహదారుల మరమ్మతులకు తట్టెడు మట్టి వేయకపోవడంతో అడుగడుగునా గోతులమయంగా మారి ప్రయాణం నరకప్రాయంగా మారింది. కూటమి సర్కాల్ ప్రత్యేక చొరవ తీసుకుని తారు రోడ్డు సౌకర్యం కల్పిస్తారని ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.



గూడూరులో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ - తడ ఎంఈవో మల్లికార్జునరావును సత్కరిస్తున్న తిరుపతి, నగరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్ - కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్న వెంకటగిరి పట్టణంలోని మనులాలపేట పాఠశాల ఉపాధ్యాయురాలు జగదీశ్వరి

గురువుల రుణం తీర్చుకోలేనిది

గూడూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పించి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే గురువుల రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో డీవైఈవో మోహన్‌రావు, ఎంఈవో కాంచన, పవన్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, బాలకృష్ణంరాజు, దశరధ రామిరెడ్డి, రూపవతి, సురేష్‌బాబు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరు ప్రధాన ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్న పెంటపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు చెంతాటి వరలక్ష్మిని సన్మానించారు.కార్యక్రమంలో ఎంఈవో రవూఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడ: ఎంఈవో మల్లికార్జునరావు, ఎస్జీటీ శారద జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్నారు. శుక్రవారం తిరుపతిలో జరిగిన గురుపూజోత్సవంలో తిరుపతి, నగరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివా సులు, గాలి భానుప్రకాష్, కలెక్టర్ వెంకటేశ్వర్ చేతులమీదుగా ఎంఈవో మల్లికార్జునరావు, ఎస్జీటీ శారద పురస్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎస్జీటీలు రాంబాబు, నాగవేణి, సుహాస్‌కుమార్, శేషసాయికుమార్‌ను తడ ఎంఈవో కార్యాల యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేంద్ర, సుధాకర్, చెంచురామయ్య, ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురుపూజ దినోత్సవం నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 13 మందిని తహసీల్దార్ శ్రీనివాసులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, ఎఈవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోట: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎ.సుజాత(చెందోడు), ఎ.వినత(జరుగుమల్లి), సీహెచ్ దైవకృప(కొత్తపాళెం), పి.గీత(గూడలి)లను టీడీపీ నాయకులు, అధికారులు శాలువాలతో సన్మానించారు. ఆటలు, పాటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఎంఈవో మస్తానయ్య, ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు నాగేశ్వరావు, ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉషారాణి (అక్కసముద్రం), సిద్దేశ్వరి (వెంగమాంబపురం), కల్యాణి (అలిమిలి), కరుణకుమారి(మన్నూరు), స్వర్ణలత (వెంకటరెడ్డిపల్లి), ఆయోషా (మల్లెమాల), భారతి(పెండేరెడ్డిపల్లి), ఈతముక్కల వెంకటరమణయ్య (వాక్యం), వీరభద్రయ్య(భైరవరం) రామ్మోహన్ (పి.కొత్తపాళెం)లను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కందలి సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సరస్వతి శ్రీనివా సులు, పీవీ.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



కోటలో ఉత్తమ ఉపాధ్యాయులతో టీడీపీ నాయకులు, అధికారులు

వెంకటగిరి టౌన్: పట్టణంలోని మనులాలపేట పాఠశాల ఉపాధ్యాయురాలు జగదీశ్వరి, ఏపీఆర్జేసీ ప్రిన్సిపాల్ రమాదేవి కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు - ఉత్తమ ఉపాధ్యాయులతో బాలాయపల్లి ఎంఈవోలు

రైతు సమస్యలపై దృష్టి



మీడియాతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రమేష్, పక్కన టీడీపీ నాయకుడు శ్రీనివాసులు నాయుడు తదితరులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు అదనపు గోదాముల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దొరవారిసత్రం మండల టీడీపీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, స్థానిక నాయకులు మేడా సాయి నారాయణ, కొండలరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే వ్యవసాయ సీజన్‌ను దృష్టి పెట్టుకుని ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చూడాలని ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు విత్తనాలు, ఎరువుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై ఈనెల 9న సూళ్లూరుపేటలో వైసీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేసి ఆర్డీవోకి వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మీజూరు రామకృష్ణారెడ్డి, వైసీపీ నాయకులు జెట్టి వేణుయాదవ్, చిలకా యుగంధర్, చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయండి



చంద్రారెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న ఎంపీ గురుమూర్తి

తడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాశింగాడుకుప్పం వద్ద ప్రస్తుతం ఉన్న రైల్వేగేట్ స్థానంలో అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని తిరుపతి ఎంపీ గురుమూర్తిని వైసీపీ నాయకుడు చంద్రారెడ్డి కోరారు. శుక్రవారం తిరుపతి ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిశారు. అండర్ బ్రిడ్జి అవసరాన్ని వివరించారు. సుమారు 300 కుటుంబాలు ఉండే కాశింగాడుకుప్పం, బాలకృష్ణాపురం కుప్పం గ్రామాలకు అనువుగా అండర్ బ్రిడ్జి నిర్మించకుండా పూడికుప్పం వద్ద నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల కాశింగాడుకుప్పం, బాలకృష్ణాపురం కుప్పం గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. స్పందించిన ఎంపీ సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సంద ర్భంగా చంద్రారెడ్డిని ఎంపీ గురుమూర్తి శాలువాతో సత్కరించారు.